# విశ్వమానవ ధర్మం

కన్నడ మూలం

**స్వామి జయతీర్థులు**

తెలుగు అనువాదం

**కె. సుధాకరరావ్**

M.A.(తెలుగు), M.A.(సంస్కృతం)

విలేఖరి, ఆకాశవాణి కేంద్రము,

ధారవాడ, కర్ణాటక.

**విశ్వమానవ ధర్మం**

*First Edition* : 2010

*Copies* : 1000

*Published on the occasion of the*
**52nd Jayanthi on**
**30-1-2010**

*All Rights Reserved by*
**Sri Achyutaasrama**
*Virupapuragadde,*
*Sanapura (Post), Gangavathi (Taluk)*
*Koppal (Dist), Karnataka (State)*

*Price : Rs. 25/-*

ముద్రణ :

**వెల్‌కం గ్రాఫిక్స్**

2/5, బ్రాడీపేట, గుంటూరు.

# ఆశీస్సులు

**"విశ్వమానవ ధర్మం"** అను ఈ తెలుగు గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయము అందించిన వారు శ్రీ  అద్దేపల్లి విశ్వనాథం గారు, వారి ధర్మపత్ని శ్రీమతి శేషారత్నం (శేషు) గారు. వీరికి శ్రీ అచ్యుత గురుదేవులు ఆశీస్సులను, ఆధ్యాత్మిక ప్రగతిని కలుగజేయ గలందులకు ప్రార్థించుచున్నాను.

గ్రంథ ముద్రణ పర్యవేక్షణను భారముగా తలపక సేవా భాగ్యము గా చేయుచున్న శ్రీ గౌరిజవోలు బాపినీడుగారికి శ్రీ అచ్యుత గురుదేవులు ఆధ్యాత్మిక ప్రగతిని కలుగజేయగలందులకు ప్రార్థించుచున్నాను.

శ్రీ జయతీర్థ స్వామి వారు కన్నడ భాషలో రచించిన ఈ చిన్న గ్రంథాన్ని చక్కని తెలుగులో అనువదించి సాధకులకు అందించిన శ్రీ కె. సుధాకరరావు గారికి శ్రీ అచ్యుతగురుదేవులు ఆశీస్సులను అందించ గలందులకు ప్రార్థించుచున్నాను.

ఈ గ్రంథమును అందముగా ముద్రించిన  "మెస్సర్స్ వెల్‌కమ్ గ్రాఫిక్స్" అధినేతలు శ్రీ పి. పురుషోత్తమ్ గారికి శ్రీ అచ్యుత గురుదేవులు ఆశీస్సులు అందించగలందులకు ప్రార్థించుచున్నాను.

"జయ అచ్యుత"

తేది : 20-1-2010 **స్వామి సీతారామ్**

ప్రధాన గురువు, శ్రీ అచ్యుతాశ్రమము

# విజ్ఞప్తి

ప్రతి సంవత్సరము మాఘశుద్ధ పూర్ణిమ రోజు మనము పూజ్య గురుదేవులు శ్రీ యోగి అచ్యుత ప్రభువుల వారి జయంతిని జరుపు కుంటున్నాము. అచ్యుతగురుదేవుల వ్యక్తిత్వము గురించి, వారి తత్త్వమును గురించి ఉన్న గ్రంథములను ముద్రించి వెలుగులోనికి తీసుకొని రావడం మన ముఖ్య కర్తవ్యము. గ్రంథముల ముద్రణకు ఆర్థిక సహాయము చేయుచున్న దాతలకు నా నమస్కారములు.

మనమంతా అచ్యుతాశ్రమ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుదాం. అచ్యుత ప్రభువులు అందించిన విద్యను సాధన చేయడం, ఆశ్రమ సేవా కార్యాల్లో పాల్గొనడం, అచ్యుత సాహిత్యమును ముద్రించడం మొదలైనవన్నీ ఆశ్రమ అభివృద్ధి కార్యాలే. అన్నిటికంటె ముఖ్యముగా చేయవలసినది యోగవిద్యా సాధన అని సాధకులు తప్పక గ్రహించ గలరు.

"జయ అచ్యుత"

తేది : 10-1-2010

**ఐ. నారాయణస్వామి**
జనరల్ ప్రెసిడెంట్,
శ్రీ అచ్యుతాశ్రమము

# తొలిపలుకు

శ్రీ జయతీర్థ స్వామి వారి అభిప్రాయము మేరకు ధర్మమొక్కటే (కర్తవ్యమే) మానవ ధర్మము. ఈ సృష్టిలో శ్రేష్ఠులు అనిపించుకొన్న మానవులు ఆశ్రయించవలసినది ధర్మము. వారి రక్షాకవచము ధర్మము. దీనిని తెలియజేయవలెనన్న ఆది విద్య, జీవ విద్య, అమృత విద్య అని ప్రసిద్ధమైన యోగవిద్యా సాధన చేయవలెను. జీవనమును సాధనా క్రమము నుండి విశ్వ ఆది ధర్మమును, అనాది తత్వమును శాశ్వత రీతిలో సంస్థాపించుటకు ప్రభుయోగి అచ్యుతుల వారు బోధించిన యోగ విద్యయే శరణ్యమని చెప్పబడినది. దీనికి దేహేంద్రియములు ఏవియు సహకారములు కానేరవని చెప్పబడినది. విద్యను పొంది సత్యమును దర్శించవలసినదిగా వారు ఆకాంక్షించినారు.

"జయ అచ్యుత"

తేది : 20-1-2010

**స్వామి సీతారామ్**
ప్రధానగురువు,
శ్రీ అచ్యుతాశ్రమము

# ముందుమాట

గ్రంథానికి తొలుత తొలిపలుకులు, చివర్లో మలిపలుకులు – ఉండటం ఇది సనాతన భారతీయ సంప్రదాయం. ధర్మం (కర్తవ్యం) గురించిన ఆలోచన మానవ ప్రాణులకు మాత్రమే ! వేరే ప్రాణుల్లో ఉండదు. ప్రాణులు ఇంద్రియ ప్రేరణలు, ఆకలి మున్నగు బాధలకు గురై అనేక కార్యాల్ని చేస్తాయి కాని, ఇది తప్పక చేయాల్సిన ధర్మం, ఇది చేయరానిది (అధర్మం) అని ఆలోచించి, నిర్ణయించే శక్తి వాటికి లేదు.

లోకంలో హిందూ ధర్మం, సిఖ్ ధర్మం, క్రైస్తవ ధర్మం, ఇస్లాం ధర్మం, బౌద్ధమతం, జైనమతం, వీరశైవ మతం మున్నగు ధర్మాల గురించి విన్నాం. అయితే ఆయా మత గ్రంథాల్ని చదివితే సర్వకాల సర్వావస్థలకు అన్వయించే నియమాలు దాదాపు ఒకేలా మనకు కన్పిస్తాయి. కాలానుగుణంగా మారుతూ వచ్చిన సాంఘిక నియమాల్లో మనకు పరస్పర వ్యత్యాసం గోచరిస్తుంది. దీన్ని గురించి లోతుగా ఆలోచిస్తే ఏ కాలంలో, ఏ దేశంలో పుట్టినా పూర్వీకులైన జ్ఞానులు బోధించిన ధర్మం ఒక్కటే అనే అంశం బోధపడుతుంది. ఆయా జాతులకు తగిన ధర్మాలు, వృత్తులు, స్వభావాలు మరియు కర్మలకు తగిన వర్ణాలు, మనస్సుకు అనుగుణంగా నడిచే జీవనపు నియమాలు, కాలానుగుణంగా దేశ కాలాలకు తగినట్లుగా ఆ నియమాల్లో జరిగే మార్పులు – ఈ అంశాల విషయంలో విభిన్న వ్యక్తుల బోధనల్లో అధిక భేదాలున్నాయి. అవి విభిన్న మతాలనే అంశం గోచరిస్తుంది.

దేవతలు, తత్వ విభూతులు, అవతార పురుషులు, ధర్మకంటకులైన రాక్షసులు సజ్జనులకు అందించే హింసలు, వారి పరిహారాలు, జ్ఞానం,

ముక్తికోరే వాళ్ళనుసరించాల్సిన నియమాలు ఇవన్నీ వైవిధ్యమయంగా ఉన్నాయి.

ఆయా జాతుల వృత్తులు, స్వభావాలు వేర్వేరుగా వున్నాయి.

ఇలా గమనిస్తే శుద్ధమైన వర్ణమేదీ మిగిలిపోయినట్లు దాఖలాలు కన్పించవు. జాతియే కొలమానంగా భావించిన వర్ణ వ్యవస్థ కొనసాగినా, తరచు వర్ణం కారణంగా వ్యక్తుల పరివర్తనం జరగడం గ్రంథాల్లో కన్పిస్తుంది. ఇపుడు సమాజంలో మళ్ళీ వర్ణ వ్యవస్థ, దానికి అనుగుణమైన ముఖ్య వ్యక్తుల విభజన అవసరం అయింది.

అలాగే రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో కూడ మార్పులు అవసరం. ఇది మన దేశానికి మాత్రమే పరిమితమైంది కాదు. మొత్తం లోకానికి, విశ్వానికీ అన్వయించేది. ఆవశ్యకమైనది. ఇది లేకుంటే జగత్తుకు జీవమే ఉండదు.

అందుకే ఇది అవసరం. ఇంతకు ముందు నేను రాసిన “హిందూ ధర్మం” అనే పుస్తకం నాకు తృప్తిని ఇవ్వలేదు. దాన్ని ముద్రించకుండా ఇప్పుడు “విశ్వ మానవ ధర్మం” గురించి రాయాల్సి వచ్చింది. దీని ద్వారానే జగత్తుకు కళ్యాణం జరుగుతుంది. మానవలోకానికి సుఖ శాంతులు లభిస్తాయి. పాఠకులు ఈ అంశాల గురించి సంక్షిప్తంగా రాసిన విషయాలనన్నిటినీ తమలో జీర్ణించుకునే ప్రయత్నం చేయాలని నా కోరిక.

**“సర్వేజనాః సుఖినోభవంతు”**

**“జయ అచ్యుత”**

**జయతీర్థులు**

# పీఠిక

మనం జీవిస్తున్న ఈ 20, 21వ శతాబ్దాలలో వివిధ మతాల వల్లనే ద్వేషం, అసూయలు పెరిగినాయి. మానవ జీవనంలో సుఖశాంతులకు మతమే ప్రతిబంధకం. వివిధ మతాలు పరస్పర విరుద్ధ భావజాలాన్ని కల్గి ఉండి 'దేవుడు' అనే అంశం చుట్టూ తిరుగుతూ తమ మతమే శ్రేష్ఠం – మిగతా మతాలు తుచ్ఛమనే భావనకు దారి తీస్తున్నాయి. విభిన్న మతాల వాళ్ళు తమ మతమే గొప్ప అని చెబుతూ మానవ జాతిని చిన్నచూపు చూస్తారు. దీని వల్లనే అనైతికత్వం, విప్లవం, యుద్ధాలు చెలరేగి మానవ ప్రగతికే 'దేవుడు' అనే శబ్దం కంటక ప్రాయమైందనీ, ఆ దేవుడి పై నమ్మకమే మానవుల అజ్ఞానానికి సంకేతమనీ, అదే అధః పతనానికి కారణం కావడం వల్ల లౌకికమైన మన దేశంలో ఈ మతాలే ఉండకూడదనీ పిచ్చిగా నాస్తికులు వాదించడాన్ని మనం గమనిస్తున్నాం.

దైవభక్తి, ధర్మాచరణలు చాలా కాలం నుండి ఆచరించబడే భారత దేశం, జపాన్, లంకా, బర్మా మొదలైన దేశాల వాళ్ళు ఆలోచించాలి. పర్షియా, ఇజ్రేల్, అమెరికా, గ్రీక్ – మొదలైన పాశ్చాత్య సంస్కృతుల దేశాల వాళ్ళు కూడా దీన్ని గురించి బాగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా వుంది. సంస్కారహీనులై స్వేచ్ఛా జీవనం చేస్తున్నారు. ఇపుడిపుడే వేరే దేశాల సంపర్కం వల్ల జ్ఞానోదయమైనట్లు కన్పించకున్నా, జ్ఞాన, ధర్మ శబ్దాల అర్థాన్ని గ్రహించకుండా తమ స్థూల ప్రయత్నాలతో, మేధాశక్తితో, విజ్ఞానంలో కొంచెం ప్రగతి సాధించిన వ్యక్తులు తాము సర్వజ్ఞులమనీ, సర్వశక్తివంతులమనీ విర్రవీగుతూ మిగతా ప్రజల భయానికి

కారణులై శాంతికి భంగం కల్గించి,తమ అహంకారాన్ని పెంచుకుంటూ రాక్షస ప్రవృత్తితో మానవజాతి సర్వనాశనానికి నాందీగీతం పాడుతున్నారు. ఇది చాలా గంభీరమైన విషయం. దీన్ని గురించి ఆలోచించాల్సి వుంది.

వాళ్ళ దుర్జనత్వానికి సంకెళ్ళు వేసి, వాళ్ళు తమ తప్పును గ్రహించేలా చేయడం అవసరం. శస్త్రబలంతో విర్రవీగేవాళ్ళు మాటలతో వశం కారు. వారికి శస్త్రంతోనే బుద్ధి చెప్పాలి. లేదా వాళ్ళంతా నశించి శాంతి స్థాపన జరగాలి. ఇది అనివార్యం.

దీనికన్న ముందు మానవుల్లో ధర్మమనేది ఉంటే – శస్త్రధారు లెందరైనా నిరాయుధుడైన ఒక యోగిని ఏమీ చేయజాలరనే అంశాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించే గురువు జ్ఞాని అవసరం ! ఇది జరుగకుండా జగత్తు ఉద్ధరింపబడటం అనేది అసాధ్యం.

వేరే దేశాల్లో లేకున్నా ధర్మక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన మన దేశంలో అలాంటి వ్యక్తి యోగిగా నిలబడలేదా ? అలాగైతే ధర్మానికి అస్తిత్వమే లేదు. జగత్తుకు వినాశనం తప్పదు. సర్వశక్తుడైన 'దేవుడి' ఉనికి అసత్యం అని తేలుతుంది. ఇలా ఎన్నటికీ జరగదు. మనం నిరీక్షించి చూడాలి ! అంతే !

ఓం శాంతిః

జయ అచ్యుత !

# విషయసూచిక

| | | |
|---|---|---|
| 1. | విశ్వం | 1 |
| 2. | మానవుడు | 14 |
| 3. | ధర్మం | 20 |
| 4. | మానవుని చరిత్ర | 23 |
| 5. | ధర్మం యొక్క అంతర బాహ్యస్థితులు | 31 |
| 6. | ధర్మం : విభిన్నకాలాల్లో జరిగిన మార్పులు | 35 |
| 7. | ధర్మపు అవనతి | 41 |
| 8. | ఆది ధర్మాగమన లక్ష్యం | 43 |
| 9. | సంధికాలం (ఆదిధర్మమే మానవరూపం ధరించి భూమి పై అవతరించాలనే ఆశయం | 51 |
| 10. | పర్వకాలం | 53 |
| 11. | విశ్వమానవ ధర్మం | 54 |
| 12. | సత్యయుగం (శాంతి సాంమ్రాజ్య స్థాపన) | 55 |
| 13. | కల్కి – కల్కి అంటే ఎవరు? | 66 |
| 14. | ముగింపు | 69 |

# 1. విశ్వం

విశ్వం చాలా విశాలంగా వ్యాపించింది. దీని యొక్క సీమలను, సరిహద్దుల్ని, పరిమితుల్ని గ్రహించిన వాళ్ళు చాలా అరుదు. విశ్వపు మూలం, వ్యాప్తులు – ఇవి చర్మచక్షువులకు గోచరించని సూక్ష్మ విశాలాంశాలు. శక్తివంతమైన దుర్భిణులతో కాని, సూక్ష్మదర్శినులతో కాని అంతరిక్ష నౌకలతో కాని చూడరానిది విశ్వం. దాని ఆద్యంతాల్ని అందుకోవడం కష్టం. అంత విశాలమైనది విశ్వం.

ఎలాంటి మేధాశక్తికి కూడా అందనంత సూక్ష్మ వస్తువులతో, శక్తులతో కూడినదీ విశ్వం. ఈ విశ్వపు మూలాల్ని గ్రహించిన వాణ్ణి మనం 'జ్ఞాని' అంటాం. దీని వ్యాప్తిని తెలుసుకొనే వ్యక్తిని 'విజ్ఞాని' అంటాం. ఈ రెండింటినీ గ్రహించి మానవ జాతికి నియతమైన ధర్మాన్ని బోధించి, దాన్నే ఆచరించి, ఆదర్శప్రాయుడుగా మిగిలే వ్యక్తిని 'ఋషి' అంటాం. ఇవన్నీ ప్రాచీనులైన జ్ఞానుల వాక్యాలు.

వేదవాక్యాల్ని తపస్సు ద్వారా తాము తెలుసుకున్న స్థితిలో వివరించి, వ్యాఖ్యానించిన ఉపనిషన్మహర్షులు 'అలాంటి ఋషి ఒక్కడే !' అని అన్నారు. " ఆ ఒకే ఋషి నుండి మనం తత్వాన్ని గ్రహించాం' అని అన్నారు. అతనిని చూడాలనుకునే వ్యక్తులు అంతర్ముఖ స్థితిలో తపస్సు చేస్తే అతని దర్శనం లభిస్తుంది. ఎల్లపుడూ ధ్యానస్థులై కన్పించే అతని శరీరం బంగారు రంగులో ఆకర్షణీయంగా ఉంటుంది. అందుకే అతణ్ణి హిరణ్మయ పురుషుడనీ, హిరణ్యగర్భ ఋషి అనీ, త్రిమూర్తుల జనకుడనీ, బ్రహ్మకన్న శ్రేష్ఠుడైన పరబ్రహ్మ అనీ జ్ఞానులు చెప్పారు. అతడే జగత్తు కన్న ముందు ఉద్భవించిన పురుషుడు. అతని సంకల్పానుగుణంగా ఈ విశ్వం కొనసాగుతూ ఉండడం వల్ల అతణ్ణి ఆదిపురుషుడు, నరఋషి –

ఇత్యాది పేర్లతో పిలుస్తారు. అతడొక్కడే నిరంజనుడు ! సర్వజ్ఞుడు ! పవిత్రాత్మ ! మృత్యుంజయ శివుడు – ఇలా విభిన్నంగా వర్ణించారు.

దేవుడు ఎన్నోసార్లు మానవులకు గుణపాఠం నేర్పించేందుకు మనిషిగా జన్మించి, ధర్మబోధనల్ని చేసినా మానవులు వాటిని ఆచరించ లేదు. దీనికి వీళ్ళల్లో ఉండే స్వార్థం, సంకుచిత భావనలు, ఆశ, మాత్సర్యం – ఇవే కారణాలు. దీనికి తగినట్లుగా ధర్మవిరుద్ధమైన ఈ జీవనక్రమమే కారణం.

ప్రాచీనకాలంలో ఆ దేవుడు చేసిన బోధనల సారమే భగవద్గీత. అతడు ప్రసాదించిన విద్యే యోగవిద్య. వాటిని ఆశ్రయించి సాగితే మానవజాతి అభివృద్ధిలోకి వస్తుంది. ఇక్కడ గీత అంటే శ్రీకృష్ణుడనే మనిషి – అర్జునుడనే మనిషికి ఉపదేశించిన విద్య అంటే తప్పు. అందుకే వ్యాస మహర్షుల వారు గీతను "శ్రీ కృష్ణగీత" అనలేదు. "భగవద్గీత" అని నామకరణం చేశారు.

కృష్ణుడు భగవంతుని విభూతి (అవతారం). భగవంతుడి మరో అంశం అర్జునుడు. అర్జునునికి ఉపదేశం అందించినా మొత్తం మానవ జాతికి భగవంతుడందించిన సందేశమది. ఈ అంశాన్నే మనం గీతలోని "విభూతియోగం" అనే అధ్యాయం ద్వారా గ్రహించగలం.

గీతలో భగవంతుడైన హిరణ్యగర్భ పురుషుని మాటలున్నాయి. అతని ఉద్భవానికి మూలమైన పూర్ణ చైతన్యం నుండి వచ్చిన వాక్యాలున్నాయి. "నిన్ను పూజించాలా ? అవ్యక్తాన్ని ఉపాసించాలా? " అనే అర్జునుని ప్రశ్నకు "నన్నే ఉపాసించు. అవ్యక్తోపాసన దేహధారులకు క్లేశకరం (తృప్తినివ్వజాలదు)" అని పరమాత్మ సెలవిచ్చాడు.

"అలాగే ఈ జ్ఞానాన్ని పూర్వంలో నేను వివస్వతుడికి అందించా. అతడు తన కొడుకుకు బోధించాడు. అక్కణ్ణుంచి ఇక్ష్వాకురాజులకు పరం

పరగా బోధించబడింది. కాలవైపరీత్యం వల్ల ఆ ఉపదేశం ఇపుడు కన్పించుట లేదు. అందుకే మళ్ళీ బోధిస్తున్నా" అని పరమాత్మ గీతలో చెప్పాడు. దీని వల్ల షడ్దర్శనాల్లో ఒకటైన "యోగదర్శనం" మూలపురుషుడే హిరణ్యగర్భుడనీ, అతడు రచించిన గ్రంథాలేవీ లభించడం లేదని ఇప్పటి వాళ్ళు రాసింది సరేనని అనిపిస్తుంది.

"నీ జన్మ ఇప్పటిది ! వివస్వతుడి జన్మ చాలా పురాతనం ! నీ ద్వారా ఈ తత్వ రహస్యం అతనికి ఉపదేశింపబడిందనే మాటను నమ్మడం ఎలా?" అనే అర్జునుని ప్రశ్నకు "నేను జనన మరణ రహితుడను ! నిరంతరం ఉండే విశ్వానికి ప్రభువును ! జనకుణ్ణి ! ఇపుడు అధర్మం పెరగడం వల్ల నేను కౌరవాదుల్ని సంహరించేందుకు కాలుడనై నిలుచున్నా" అని కృష్ణుడు బదులు ఇచ్చాడు. అపుడు అర్జునుడు శ్రుతులలో, స్మృతులలో వర్ణితమైన, పురుషసూక్తంలో వర్ణింపబడిన పరమాత్ముని, "సహస్ర శీర్షాః పురుషః సహస్రాక్షః సహస్రపాత్, సభూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠద్ధ శాంగులం" మొదలైన మంత్రాల్లో వర్ణింపబడిన విరాట్ రూపాన్ని ప్రదర్శించాలని విన్నవించాడు. విరాడ్రూపం చూశాక అర్జునునికి నమ్మకం కల్గుతుంది.

"విష్ణు పురాణం"లో "దేవుడు హిరణ్యగర్భుణ్ణి సృష్టించాడు; హిరణ్యగర్భుడు మూలప్రకృతి కృపతో బ్రహ్మను సృష్టించాడు ; పాలసముద్రం మధ్యలో ఒక గుడ్డు పుట్టింది; అది రెండుగా చీలింది. పై భాగంలోంచి ఊర్ధ్వ లోకాలు పుట్టాయి. క్రింది భాగంలోంచి అధోలోకాలు పుట్టాయి. మధ్యలో కన్పించిన దివ్యపురుషుణ్ణి నారాయణుడనీ, పరిపూర్ణ గుణార్ణవుడనీ, ప్రపంచ సృష్టి స్థితి లయలకు కారణుడనీ వర్ణించడం జరిగింది. అతని నుంచే త్రిమూర్తులు ఉద్భవించి (బ్రహ్మ విష్ణు

మహేశ్వరులు) క్రమంగా సృష్టి, స్థితి, లయ కార్యాలలో నియుక్తులైనా రనే వర్ణన ఉంది. అందుకే ఉపనిషన్మహర్షులు 'బ్రహ్మ' అనే శబ్దాన్ని ఆత్యంతిక సత్యం అయిన పూర్ణ చైతన్యానికి మాత్రమే అన్వయింప జేశారు. ఋగ్వేదంలో 'అగ్రే ఆత్మ ఏవ ఆసీత్' అనే వాక్యంలో మొదట ఆత్మ ఒక్కటే ఉన్నది. దాంట్లోంచి జీవం పుట్టింది – అని రాయబడింది.

ఈ జీవులు బాగా వేడి చేయబడిన ఇనుప కడ్డీలోంచి వెలువడే నిప్పురవ్వల్లాంటివి అని అందులో మునులు చెప్పారు. వేదాల్లో బ్రహ్మ అనే శబ్దానికి 'బృహతీతి బ్రహ్మ' (చాలా పెద్దది) అనే నిర్వచనం ఇవ్వ బడింది. అందుకే మన మహర్షులు 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అన్నారు. ఎందుకంటే ఈ జగత్తులో జన్మించిన ప్రతి వస్తువు ఒక్కో విశేష గుణాన్ని, శక్తిని కల్గి ప్రయోజనకరంగా ఉందని పెద్దలు బోధించారు. త్రిమూర్తుల్లో సృష్టికర్తగా చెప్పబడ్డ వ్యక్తినే 'భగవద్గీత'లో 'ప్రజాపతి'గా వర్ణించడం జరిగింది. 'బ్రహ్మ' అనే వర్ణన కన్పించదు. అలాగే గీతలో స్థూల ప్రకృతి యొక్క అభిమానియైన దేవికి ప్రకృతి అనే పేరుంది. జగత్తు యొక్క సృష్టి స్థితి లయాది వ్యాపారాన్ని తన ఆధ్వర్యంలో ఆమె నడిపిస్తుందనీ, ఆమె ఇచ్ఛతో ఉద్భవించిందే విష్ణు మాయ అనీ పరమాత్మ చెప్పాడు. "దైవీహ్యేషా గుణమయా మమ మాయా దురత్యయా" అన్నాడు కృష్ణ పరమాత్మ. ఈ దైవీమాయను అధిగమించడం కష్టం అని తాత్పర్యం.

"సృష్టి ఆదిలో నల్గురు కొడుకులు నా నుంచే జన్మించారు". ప్రాణం, వాయువు, జలం, తేజస్సు అనే నాల్గు భూతాల అభిమాన దేవతల వర్ణన పై వాక్యంలో ఉంది. ఐదవ ముఖంగా చెప్పబడిన ఆదిపురుషుడైన కాముడే ప్రకృతికి ప్రభువు అనిపించుకున్నాడు. ఆకారం లేని పూర్ణ చైతన్యమే పంచముఖ పరమేశ్వరుడిగా వర్ణించబడింది.

ఆదిపురుషుణ్ణి దేవతలు, ఋషులు బలి ఇచ్చి లోక కల్యాణం కోసం యజ్ఞం చేశారు. ఆ యజ్ఞఫలంగా మరో దివ్యపురుషుడు ఉద్భవించాడు. అతడే విశ్వప్రభువైనాడు. ఇది వేదాల్లో చెప్పబడిన కథ. రుద్రుని మూడో కంటి జ్వాలల్లో భస్మీభూతుడైన కాముడే (మన్మథుడు) ప్రథమ పురుషుడు. విరాట్‌శక్తికి (విద్యుత్తు, వాయువు) అభిమాని దేవత అయిన వాడే రెండో పురుషుడు.

"ప్రాణాన్ని" స్వరాట్ అంటారు. "వాయువు"ను (విద్యుత్) "విరాట్" అంటారనీ తత్వవేత్తల అభిప్రాయం. మూలచైతన్యాన్ని "పరమ స్వరాట్'గా, 'పరబ్రహ్మ'గా, 'పరంజ్యోతి'గా అభివర్ణించారు మన మహర్షులు.

పురుషఖండంలో (కుమార సర్గం) కూర్చుని అంతర్ముఖుడైన పురుషుణ్ణి స్వరాట్ అనడం సమంజసమే. అలాగే అక్కడ నుండి పుట్టి త్రిమూర్తుల జనకుడు (తండ్రి) అనిపించుకున్న నారాయణుణ్ణి 'విరాట్' అనడం సరైనదే ! పూర్ణంలోంచి తొట్టతొలుతగా ఉద్భవించిన ప్రాణశక్తి యొక్క అభిమాని దేవతను 'ప్రాణదేవుడు'గా వర్ణించారు. యాజ్ఞవల్క్యుల వారు వ్యక్తికి ప్రాధాన్యాన్ని ఇవ్వకుండా 'శక్తి'కి (తత్వానికి) ప్రాధాన్యం అందించి 'ప్రాణదేవుడు'గా చెప్పారు. (బృహదారణ్యకోపనిషత్తు).

జగత్తు ఎలా సృష్టించబడింది? అనే అంశాన్ని తెలుసుకోకుంటే – విశ్వమంటే ఏమిటనే అంశం అవగాహనకు రాదు. అందుకే దాన్ని గురించి ఇక్కడ సంక్షిప్తంగానైనా వివరాలందిస్తున్నాం. పూర్ణమైన చైతన్యం (ఆత్మ) నిరంతరం ఉంటుంది. "ఆత్మావై ఆకాశః" (ఆత్మే ఆకాశం). ఇది చాలా ఉత్కృష్టం. శూన్యమంటే చాలా సూక్ష్మమైనది. (ఇంద్రియాలకు గోచరించదు) అందులోంచే వాయువును పుట్టించిన 'ప్రాణశక్తి' జన్మించింది. వాయువులోంచి అగ్ని (తేజస్సు) పుట్టింది.

ఆ తేజో కిరణాలు ఏడుగా, ఒక్కొక్కటి ఏడేడుగా విభజింపబడుతూ సప్తమారుతాలు, సప్త అనిలాలు, సప్త లవణాలు, సప్త ఖనిజాలు, సప్త ధాతువులు, సప్తస్వరాలు ఇత్యాదిగా వేర్వేరు అంతరంగాలలో వేర్వేరు రూపాల్ని పొంది, "అగ్నించ విశ్వసంభవం" (అగ్ని యొక్క తేజస్సునుండే అన్ని లోకలోకాంతరాలతో కూడిన విశ్వం నిర్మించబడింది) జగత్తులోని ప్రతి శ్రేష్ఠ వస్తువు, వ్యక్తి, ప్రాణి, ధాన్యం 'మమ తేజోంశసంభవం' (నాలోని ఒక్కో తేజఃపుంజం) అని గీతలో భగవానుడు చెప్పిన అంశాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. 'జీవ భూతమూ తన అంశమే' అనే గీతావాక్యంలో అంశమంటే భాగమని వివరించి, భాగమయ్యాక మూలం అపూర్ణ మౌతుందనీ, అందువల్ల జీవదేవుల సంబంధం అంశ – అంశి సంబంధం అయి ఉండక, ప్రకృతి అనే దర్పనంలో కన్పించే పరమాత్ముని ప్రతిబింబమే జీవమై ఉండడాన్ని కల్పించిన ద్వైత, అద్వైత మతాచార్యులది బాలబుద్ధి అనే చెప్పాలి. తనకు, జీవులకు ఉండే సంబంధాన్ని సూర్యుడు, సూర్యుని కిరణాలతో పోల్చడమైనది గీతలో. వేదంలో బాగా వేడెక్కించబడిన ఇనుప కడ్డీ – దాన్నుంచి వెలువడే నిప్పురవ్వలతో పోల్చడమైనది. ఈ రెండింటినీ విడిచిపెట్టిన వాళ్ళు ఆచార్యులు కాజాలరు. తత్వజ్ఞులు కాలేరు. వాళ్ళ మాటలు కూడ భగవద్గీతకు విరుద్ధంగా వున్నాయి. అందువల్ల వాటిని కూడ నాస్తిక వాదాలని చెప్పడం తప్ప మరోదారి లేదు.

'పరమాత్మలాగే జీవులూ అనాది, నిత్యులు' అనే ద్వైతం, అద్వైతాల వాదం కేవలం అజ్ఞాన జన్యమే కాదు; అహంకార పరాకాష్ఠ. తనలాగే అనాదినిత్యులైన జీవుల పై ఆ పరమాత్మ అధికారం ఎందుకు? దానికి అతని జవాబు ఏమిటంటే–అతడు సర్వశక్తుడు కావడం వల్ల. అంటే అక్కడ తండ్రి కొడుకుల మధ్య ఉండే సహజమైన ప్రేమ సంబంధంలో

ఉంటుంది. సర్వశక్తుని మరియు అల్పప్రాణుల మధ్య సంబంధమును పరిపాలించేది శక్తే కాని సహజప్రేమ కాదు. అంటే ఇక్కడ పరమాత్ముని సహజత్వం అంటే స్వార్థియైన అధికార లాలసత్వంతో తనలోని శక్తిని దురుపయోగం చేయడం ద్వారా జీవుల్ని పరిపాలించే ఒక సర్వశక్తుడి రాక్షసత్వం, దేవత్వంలో దయ, ప్రేమ, న్యాయం, నీతి - ఇవేవీ లేని దేవత్వం అని అర్థం. ఇది ఎలాంటి జ్ఞానం ? దాని కోసమనే అన్ని పురాణాల సారమనిపించుకున్న గరుడ పురాణంలో "తత్వం ద్వైతాద్వైత వివర్జితం' అని చెప్పబడింది. (అది ద్వైతమూ కాదు, అద్వైతమూ కాదు. రెండింటి కన్న భిన్నమైనది). గరుడ పురాణాన్ని మహావిష్ణువు గరుత్మంతునికి చెప్పడం జరిగింది. హిరణ్యగర్భుని ద్వారా వివస్వతునికి బోధించబడ్డ భగవద్గీతనే నిర్లక్ష్యం చేసే వారికి నారాయణునిచే గరుత్మంతునికి చెప్పబడ్డ ఈ పురాణం ఒక లెక్కా? వేదాల వాక్యాల్లో కానీ, మహర్షుల ఉపనిషత్ బోధల్లో కానీ, ఆగమపురాణాల్లో కానీ తమ వాదానికి (అదే సత్యమని వాళ్ళ వాదన) పూరకమైన దాన్ని స్వీకరించాలనీ, విరుద్ధమైన దాన్ని విడువాలని వాళ్ళ నిర్ణయం. వాళ్ళ అనుయాయులు తమ మత స్థాపకుల్ని సర్వజ్ఞులనీ, వాళ్ళ నిర్ణయానికి విరుద్ధంగా ఆలోచించడం కూడా మహాపాపమేనని భావిస్తారు. నిరంతరం భీతితోనే కాలం గడుపు తుంటారు. ఆ భయాన్నే 'భక్తి' అంటారు.

ఇపుడు ఈ విశాలమైన విశ్వం అణువులు, పరమాణువులతో రూపు దాల్చిందనే సత్యాన్ని ఇప్పటి శాస్త్రవేత్తలు కొత్తగా కనిపెట్టిందేమీ లేదు.

భారతీయ షడ్దర్శనాలల్లో ఒకటైన కణ్వుని వైశేషిక దర్శనంలో ఈ వివరాలున్నాయి. ఒక పరమాణువులో $7 \times 7 \times 2 = 98$ మరియు

మూలభూతాలు 5 × 2 = 10 చేరి 108 అణువులు ఉంటాయి. ప్రతి యొక్క వస్తువు సృష్టికి అణుసంయోగమే కారణం. ఈ నూరింటిలో ముఖ్యాధారాలు ఎనిమిది. (అపరా ప్రకృతి ఈ ఎనిమిదింటితో కూడు కున్నది) మిగతా 100 ఒక్కోదాంట్లో మళ్ళీ పదిగా విభజింపబడి 16000 గా మారి, దానికి 8 కలిపితే మొత్తం 16008 వస్తుంది. వీటితో సంయోజితమైన ప్రకృతి (స్థూల) పరమాత్మ సంతానాన్ని (జీవుల్ని) భరించే భార్య అనీ, ఆ 16008 వేర్వేరు అస్తిత్వాల్ని కల్గి వున్నా బయలులో ఉండటం వల్ల పరమాత్మ భార్యలనీ, అందుకే అవతారమూర్తి అయిన శ్రీకృష్ణుడు 16008 భార్యలను వరించాడనీ భాగవతం చెబుతుంది. ఇది కల్పితమే ! నిజం కాదు. భాగవతం భక్త భావ పోషకమైన కావ్యేతిహాసం కాదు. భారత, రామాయణాలు ఐతిహాసిక గ్రంథాలు. హరివంశంలో శ్రీకృష్ణునికి ఎనిమిదిమంది పట్టపురాణులు, ప్రియపత్ని రాధ – వీళ్ళంతా భార్యలని చెప్పేందుకు తగిన ఆధారాలున్నాయి. భాగవత కావ్యంలో రాధ పేరే లేదు. భాగవతాన్ని అష్టాదశ పురాణాల్లో ఒకటిగా భావించడం తప్పు. ఆ పురాణాల్లో దేవీ భాగవతం ఒకటి !

నూతనులైన ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలకు విశ్వానికి సంబంధించిన పరిపూర్ణ జ్ఞానం కల్గలేదనే అంశం వారు తీసుకునే నిర్ణయాల్లోనే తేటతెల్ల మౌతుంది. అసంఖ్యాకంగా కోటి నక్షత్రాలున్నాయి. ఒక్కో నక్షత్రం ఒక్కో సూర్యమండలమనీ ఆధునిక విజ్ఞానుల అభిప్రాయం. నిజానికి ఇది తప్పు. సూర్యమండలాల సంఖ్య ఒక కోటి మాత్రమే. ధృవమండలం నక్షత్రం. సూర్యమండలం కాదు. సృష్టి విజ్ఞానంలో దీనికి ఆదిత్యమండలమని పేరు. కోటి సూర్యమండలాలకు శక్తి పంద్రెండు ఆదిత్యమండలాల ద్వారా వ్యాపిస్తుంది. ఆ పంద్రెండింటిని Pulsors అని ఆధునిక విజ్ఞాన

శాస్త్రవేత్తలు చెబుతారు. మన ఈ లోకానికి పూర్వదిక్కులో సూర్యమండలం ఉంది. అయితే ఉత్తరంలో ఉండేది ధృవనక్షత్రం. అలాగే అష్టదిక్కులకు ఎనిమిది ఆధార స్తంభాలు (pole stars) ఉన్నాయి. ఈ ఎనిమిది దిశల్ని కలిపి ఒక అష్టభుజాకృతిని నిర్మిస్తే దాని మధ్యలో వర్ణ నక్షత్రమండల ముంది. దానికి పైన రెండు (గోలోకం, మరియు కుమారసర్గలు), క్రింద రెండు (ధృవమండలం మరియు దానికి దక్షిణంలో ఒక ఆదిత్య మండలం) వైకుంఠలోకాలున్నాయి. కుమారసర్గకు ఎడమ వైపున ప్రకృతి ఖండం, కుడి వైపున శ్వేతకల్పం అనే రెండు – ఇలా 12 ఆదిత్య మండలాలున్నాయి. ఈ పంద్రెండు శక్తి ప్రసారమయ్యే మూలంలా భాసిస్తాయి. దాన్నే భాను మండలమనీ, దానికి అధిపతి సూర్యుడనీ చెబుతారు. సూర్యమండలం అంతర్దృష్టికి కనిపించీ కనిపించనట్లుగా ఆభాసిస్తుంది. స్థూలంగా కనిపించదు. అందుకే దానికి ఆలోకమని పేరు. ఆదిత్య, సూర్య, నక్షత్ర, తార – ఇవన్నీ వేర్వేరు మండలాలు. ఈ విషయాల గురించి ఏమీ తెలియని ఆధునిక శాస్త్రవేత్తలకు తెలిసిన విజ్ఞానం మాత్రం ఏపాటిది? విచారించాలి.

ఒక్కో సూర్యకుటుంబంలో నవగ్రహాలనే ఒక వ్యూహం (పరివారం) ఉంది. అందువల్లనే ఈ విశ్వానికి ప్రభువైన స్వామిని 'నవకోటి నారాయణుడు' అన్నారు. జ్ఞాన, విజ్ఞానాల్ని బాగా తెలుసుకున్న వారు చెప్పిన సత్యమిది.

భూమిని గ్రహంగా పరిగణించకుండా అక్కడ నివసించే జలం, ధాన్యం, స్థలాలపై ప్రభావాన్ని చూపించే సూర్యుని చుట్టూ తిరిగే మిగతా 7 గ్రహాలు, ఉపగ్రహాల్లో భూమికి చాలా దగ్గరగా ఉండే చంద్రుణ్ణి, గ్రహరాజైన సూర్యుణ్ణి కలిపి తొమ్మిది గ్రహాలన్నారు. సూర్యుని నుండి

ప్రసరించే కిరణాలు వేడిగా ఉండడం వల్ల రవిని క్రూరగ్రహం, పాపగ్రహంగా ఇప్పటి జ్యోతిష్కులు భావిస్తారు. అందువల్ల వీళ్ళు చెప్పే జాతకఫలాలు, గోచారఫలాల్లో వ్యత్యాసం కన్పిస్తుంది.

నవగ్రహాల్ని అధోలోకాలనీ, వాటిలో ఉపగ్రహమైన చంద్రుణ్ణి పుణ్యగ్రహమనీ అంటారు. అక్కడ సిద్ధ పురుషులు నివసిస్తుంటారు. తమ వద్ద ఉండే సోమరసంతో జీవిస్తారు. వారికి స్థూలపానీయాల అవసరం లేదు. వీరు స్వేచ్ఛగా కామరూపులై దృశ్యాదృశ్య స్థితులలో సంచరించ గల్గుతారు. మిగతా అధోలోకాల్లో కంటికి కన్పించే దేహధారులై ఉంటారు. కుజగ్రహమే పితృలోకం. దీనికి ఆర్యముడు అధిపతి. అక్కడ పితృదేవతలు సంవత్సరం దాకా ఉండి వేరే జన్మ పొందుతారు. బుధగ్రహం దేవతల లోకం. పుణ్యజీవుల సుఖానుభవభూమి. గురుగ్రహం గ్రహాల్లో పెద్దది. దీన్నే బృహస్పతి లోకం అంటారు. బృహస్పతి అధ్యక్షతలో మేధావులంతా చేరి నిర్ణయాలు స్వీకరించే లోకం. వాళ్ళ సలహాలు బృహస్పతి ద్వారా ఇంద్రునికి చేరుతాయి. శుక్రగ్రహం రససిద్ధుడైన శుక్రుని సంతానమైన రాక్షస లోకం. శనిగ్రహం యమలోకం లేదా నరకలోకం. అక్కడ వెలుగనేది ఉండదట !

సూర్యలోకాన్ని ఇంద్రలోకమనీ, ధృవమండలాన్ని బ్రహ్మ (సత్య) లోకమనీ, దానికి వ్యతిరేకదిశలో ఉండే దాన్ని రుద్రలోకమనీ (రజతాద్రి) ఈశాన్యలోకాన్ని కైలాసమనీ అంటారు. దీన్నే కిన్నరఖండమనీ అంటారు. పంచప్రాణాలలో ముఖ్యమైన హృదయస్థ ప్రాణశక్తి అభిమాని దేవత అయిన ముఖ్య ప్రాణుని లోకాన్ని కింపురుష ఖండమనీ, వరుణ మండలాన్ని (శ్వేతద్వీప) మహాలోకమనీ, గోలోకాన్ని జనోలోకమనీ (జ్ఞానుల, ముక్తుల భూమి), కుమారసర్గను (పురుషఖండం) తపోలోకమనీ (విద్యుల్లోకం)

అంటారు. ప్రకృతి ఖండాన్ని యోగినుల లోకమనీ (కమల సరోవరం), వాయవ్యదిక్కులోని ఆదిత్యమండలాన్ని వాయు (గరుడ) లోకమనీ, అక్కడ ఉండే వాళ్ళను ఖేచరులనీ, యోగసిద్ధుల్ని విద్యాధరులనీ, వాళ్ళ అధిపతిని అనంతుడనీ, మిత్రుడనీ అంటారు. పరిపాలించే ప్రభువుతోపాటు అతడు వరుణునితో ఉంటూ, సంచరిస్తూ అతని ఆప్తమంత్రిలా ఉంటాడనీ అంటారు. ఖగపతి (ఖేచర ప్రభువు) అయిన వాయువు మహావిష్ణువు యొక్క వాహనం (సందేశ వాహకుడు) అనీ, అతడు మహావిష్ణువు (వరుణుడు) వద్ద ఉంటూనే తరుచూ కార్యాల నిమిత్తం సంచరిస్తూ ఉంటాడనీ, అతని దయతో అమృతత్వాన్ని అందించే అమృతం లభిస్తుందనీ, సర్వారిష్టాల్ని నివారించే శక్తిమంతుడనీ అతణ్ణి వర్ణిస్తారు. వరుణ మండలానికి సమీపంలో అగస్త్య మండలం ఉంది. అదే విష్ణులోకం లేదా వైకుంఠం.

దీన్నంతా పుక్కిటి పురాణంలా భావించే మన ఆధునిక శాస్త్రవేత్తలకు విశ్వవిజ్ఞానం ఏ స్థాయిలో ప్రాప్తించిందో ఆలోచించడం అవసరం. ఇంతదాకా నేనందించిన వివరాలు ఏ పురాణంలోనూ లేవు. అక్కడుండే దంతా సాంకేతిక భాష. యోగవిద్యలో ముందుకు సాగి, తెలుసుకునే స్థితికి వచ్చాక మాత్రం ఆ శబ్దాల అర్థం స్ఫురిస్తుంది. మా గురువులు పూజ్య శ్రీ అచ్యుతుల వారి కృపాప్రసాదమైన యోగ విద్యలో నిరంతరం 18 సంవత్సరాలు చేసిన సాధనలో ఈ విశ్వరహస్యాల గురించి కొంత మటుకు మాత్రం నాకు తెలిసిందని చెప్పవచ్చు.

ఓసారి అచ్యుతస్వాముల వారు నన్నడిగారు "ఈ ప్రపంచం, విశ్వం, జగత్తు అంటారు కదా ! అలా అంటే ఏమిటి"? నేను బదులు అందించా – "ప్రపంచం పంచభూతాలతో తయారైనది. ఆ ఒక్కో

దాంట్లోనూ 5 భాగాలై ఆ 25 తత్త్వాల నుండి ఈ స్థూలప్రపంచం అయిందని అంటారు. 26వ తత్త్వమే జీవి (ఆత్మ) అనీ, 27వ తత్త్వమే పరమాత్మ అనీ చెప్పి ఉన్నారు".

ప్రభువు : వేరే వాళ్ళ గ్రంథాలలోని అభిప్రాయాలలా ఉండనీ ! దీని పై మీ అభిప్రాయం ఏమిటి?

నేను : నాకేమీ తెలియదు.

ప్రభువు : నా అభిప్రాయం చెప్పనా?

నేను : చెప్పండి.

ప్రభువు : The Universe is the creation of a Yogi (ఈ ప్రపంచం ఒక యోగి చేసిన సృష్టి)

నేను : ఓ యోగికి ఇది సాధ్యమా ?

ప్రభువు : యోగి అంటే ఎవరనేది ఎవరికి తెలుసు? జగత్తు సృష్టి అయినప్పటి నుండి ఇందులో జన్మించిన ఏ వ్యక్తీ యోగి కాలేదు.

నేను : జనకుడు, శుకుడు మున్నగువారు.

ప్రభువు : వ్యాసుడు ముని; శుకముని మహర్షి అనిపించుకున్నాడు. జనకుడు రాజర్షియే కాని యోగి కాదు. సాత్వికగుణ వ్యామోహం ఉన్న అతనిలో సమత్వం ఎక్కడ ?

నేను : శివుణ్ణి యోగి అంటారు.

ప్రభువు : పరంతపుడైన హిరణ్యగర్భ ఋషి. అతడొక్కడే శివుడని (శాంతుడు) కొందరు అన్నారు. తపస్సులో అతనిలోని అగ్నితత్త్వం శాంతమై, జలతత్త్వం వెలికి వచ్చి, స్థూలజలంగా వెలువడ్డాక అతడు శాంతుడైనాడు. (శివుడనిపించు

కున్నాడు). అపుడు దీన్ని గ్రహించిన జ్ఞానులు అతణ్ణి శాంతేశ్వరుడు, జ్ఞాని, శ్రేష్ఠుడు, ఆదిదేవుడు, అచ్యుతుడు, శివుడు మొదలైన పదాలతో వర్ణించారు. శివుని జటాజూటం నుండి గంగ పుట్టింది. అతణ్ణి అర్ధనారీశ్వరుడు అర్ధనరుడు అని అన్నారు. అతడు ఒక ఋషియే కాని యోగి కాడు.

నేను : అలాగైతే యోగి ఎవరు?

ప్రభువు : ఈ విశ్వాన్ని పరిపాలించే వాడొకడు ఉన్నాడు. అతణ్ణి చూస్తే అంతా స్పష్టమౌతుంది.

నేను : అతణ్ణి చూడడం ఎలా ?

ప్రభువు : ఆతురత తగదు. అతణ్ణి చూడాలంటే తపస్సు కావాలి. తపస్సు చేసేందుకు యోగవిద్యయే సాధనం.

నేను : నాకూ అదే కావాలి. దయచేసి ఆ విద్యను ఉపదేశించండి.

ప్రభువు : సరే ! ఉపదేశిస్తాను ! అయితే ఆతురత తగదు. నీవు పుస్తకాల్లో చదివిందంతా మరచిపోవాలి. అలా చేస్తేనే జ్ఞానప్రాప్తి సాధ్యం. సమయం రానీ ! నేనే చెబుతాను.

అలా వారు ఉపదేశించిన తర్వాత కూడా ఆయన "తనను తాను తెలుసుకొనేంత దాకా మరోదాన్ని తెలుసుకోవడం సాధ్యం కాద"ని అంటూ ఉండేవారు. అది నా అనుభవానికి వచ్చింది. నన్ను నేను తెలుసుకున్నాక నేను అందరిలా కాకుండ "ఆత్మ" వల్లనే ఇక్కడే ఇప్పుడే వచ్చి జన్మించిన దాని యొక్క ఒక 'తేజోకిరణవిభూతి'. ఇదే నా తొలి జన్మ. నాకు వెనుకటి జన్మ ఏదీ లేదు. సంచితం, ప్రారబ్ధం, పాపపుణ్యాలు రెండూ లేవు. ఆగామి కర్మ మాత్రమే అని తెలిసింది. దీని తర్వాతనే నా పూజ్య

గురువు ప్రభుయోగి అచ్యుతుల వారే ఆదిదేవుడు, అచ్యుతుడు, శివుడు, ఆదినారాయణుడు – ఇత్యాది పేర్లతో జ్ఞానుల ద్వారా స్తుతించబడుతూ విశ్వమునంతా పాలించే సర్వతంత్ర స్వతంత్రుడు. నిర్లిప్తుడు కాడు, నిరాకారి కాడు. విరాట్ పురుషుడు అని స్ఫురించింది. ఈయన్నే ఈశ్వరుడు, మహేశ్వరుడంటారు. ఇతడు నిరంజనుడు. నిత్యముక్తుడు. పురుష గర్భుడని పించుకున్న పూర్ణచైతన్యం (ఆత్మ–లింగం) నుండి ఉద్భవించిన జీవుడనే వృక్షమితడే ! ఈయన ద్వారా ప్రసాదించబడిన విద్యలో, ప్రాణాగ్నిలో శుద్ధులౌతుంటారు. జీవజలమున మునిగి పవిత్రులౌతారు. అతని ముఖము నుండి జాలువారే ముత్యాల ఫలాలను తిని, గ్రహించి, జీర్ణించు కుని జ్ఞానులై అమృతత్వాన్ని పొందుతారు. ఇతనినే ఏసుప్రభువు నా తండ్రి అని అన్నాడు. అయితే ఏమాశ్చర్యం ! ఇతడు 'నేను దేవకుమారుడనే' I am Christ Second to this earth' అంటాడు. అన్నప్పుడు తండ్రి ఎవరు? ఆకారవికారాలు లేని 'ఆత్మ' అని తేలింది.

# ౨. మానవుడు

'మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః' దత్తాత్రేయ యోగి అన్నారట. మనస్సుండే వ్యక్తి మనుష్యుడు, మానవుడు, నరుడు! (జ్ఞానవంతుడు) వానరుడు – బుద్ధిశక్తి తక్కువగా, దేహబలం ఎక్కువగా ఉన్న వాడు. 'దను'వు యొక్క సంతానము దానవులు. రాజ్యాన్ని రక్షించేందుకు అవసరమైన శారీరక బలం, బుద్ధిబలం వున్నవాళ్ళే రాక్షసులు, రాజ పురుషులు, క్షత్రియులు ! అధర్మమార్గంలో వెళ్ళితే వీళ్ళే రాక్షసులని అనిపించుకుంటారు. సత్వప్రధానులై, శాంతిప్రియులైన రాజులు ప్రత్యక్ష దేవతలని అనిపించుకున్నారు.

ఇలా చూస్తే – ఆది నుండి ఇప్పటి దాకా ఉండిన, ఉంటున్న, ఉండబోయే జీవులంతా మానవులే. మనస్సే లేని జీవి – ప్రాణి ఏది? మొక్కలలో ప్రాణం, మనస్సు – లేవు. కేవలం జీవకణాలతో కూడిన దేహం ఉంది. ఆహారోత్పత్తి బయటి నీరు, గాలి, సూర్యరశ్మి – వీటి సాయంతో జరుగుతుంది. రాత్రి ఇది సాధ్యం కాదు. ఈ మొక్కలే జీవకణాల పోషణకై గాలిలోని ఆక్సిజన్‌ను ఉపయోగించుకుని, కార్బన్ డైయాక్సైడ్‌ను విసర్జిస్తాయి. అందుకే రాత్రిపూట చెట్ల క్రింద పడుకో రాదనడం. ఇది విజ్ఞానం. దీన్ని గ్రహించక మొక్కలకు కూడ మనస్సుంది; ప్రాణముంది ! దానికి హింస కల్గుతుంది. దాన్ని తినడం పాపం. దానికి సుఖ సంవేదనల్ని గ్రహించే శక్తి ఉందని చెప్పడం విజ్ఞానం కాదు; అల్పమైన జ్ఞానం. టచ్‌మినాట్ (అత్తిపత్తి) రక్తాన్ని పీల్చే రాక్షసి మొక్కల ఉదాహరణను అందించి కొందరు మొక్కల్లో ప్రాణం, మనస్సు ఉన్నాయని ప్రతిపాదించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది తప్పు. ఉదాహరణకు అయస్కాంతం రాయి. ఇనుమును ఆకర్షిస్తుంది. అలాగే పాదరసం స్పర్శతో ఇనుము బంగారం అవుతుందంటారు. అభ్రకం పార దర్శకం. మరకతం పాము విషాన్ని పీల్చుకుంటుంది.

పాదరసంలో చాంచల్యముంది. అలాగే రావిచెట్టులో గర్భకోశ దోషాల్ని నిర్మూలించే గాలి ఉంటుంది. Memosa ఏ వస్తువు తగిలినా ముడుచుకుంటుంది. రాక్షసి మొక్కలలో ప్రాణి చిక్కుకున్న వేళ, దేహం పిండబడి, అందులోని రక్తజలాంశమంతా పీల్చబడి, దేహం పిప్పిగా మారి ప్రాణం నష్టమౌతుంది. మరణం సంభవిస్తుంది.

అందుకే మొక్కల్లో జీవం ఉంది అనడం కేవలం భ్రమే ! వృక్షాల నాశం ద్వారా పాపం ఎలా వస్తుంది? చెట్లు ప్రాణులకు, పక్షులకు

నివాసస్థానం. మానవులకు వాటి వల్ల మహోపకారం జరుగుతుంది. వాయుమండలాన్ని శుద్ధీకరించడం, మేఘాల్ని ఆకర్షించి వానలు కురిపించడం నీడను, ఆశ్రయాల్ని అందించడం, ఆహారాన్ని, వంట చెరకును అందించడం – ఇవన్నీ చెట్ల వల్ల కల్గే ప్రయోజనాలు. వృక్షనాశం వల్ల సర్వజీవులకు ఈ లాభాలు కలుగవు. ఒక రకం కరువు ఏర్పడుతుంది. అందువల్ల ఇది పాపకార్యం. ఒక చెట్టును నరికే వ్యక్తి నాల్గు చెట్లను నాటాలి. దాని వల్ల పరోపకారం జరిగి పుణ్యం లభిస్తుంది. బైబిల్లో పాత నిబంధనలో సృష్టి గురించి చెప్పే వేళ 'దేవుడు మానవులకు, సర్వ ప్రాణులకు ఆహారంగా సస్యవర్గాన్ని సృష్టించాడ'ని చెప్పబడింది. అలాగైతే పులి, చిరుత, మొసలి, సింహం, సర్పం – వీటి కథ ఏమిటి? ఇవన్నీ ప్రాణులు కాదు, మృగాలు. మృగాల్ని దేవుడు సృష్టించలేదు. దుష్ట మానవులు (సైతాను అతని సంతతి) సృష్టించారు. అందుకే – "Man is made to make and woman to serve" (మానవుడు సృజనాత్మక కార్యాలు చేసేందుకు పుట్టాడు. స్త్రీ అతనిని సేవించేందుకు సృష్టించబడింది) అని చెప్పారు. నాశనం చేసేవాళ్ళు దేవపుత్రులు కాదు; సైతాను సంతతి. దానవులే ! అలాగైతే మొదట Lucifer గా పేరు పొందిన Arch దేవతలలో ఒకడు కదా ? తర్వాత సైతాను కథ ఏమిటి? అనే ప్రశ్న ఉద్భవిస్తుంది. నిజం ! తొలుత మానవుడుగా ఉన్న ఇతడు ఆశ, స్వార్థం, మత్సరం, అహంకారాలకు లోనై సైతాను అయ్యాడు. అందుకే God made man but man made hell" అనే నిర్ణయాన్ని జ్ఞానులు మనకు అందించారు.

మానవుడంటే ఎవరని తెలుసుకునేందుకు ఇదంతా చెప్పడం అవసరమైంది. ఇంకా చెప్పడం అవసరం. 'నాకు దీనిని తినబుద్ధి అవుతోందని అన్నపుడు ఆశ, ఇచ్ఛ కల్గిందని అర్థం. జీవనం సహజత్వం.

మననం చేసే శక్తినే మనస్సు అంటారు. జీవితంలో కల్గే ఆశ, ఇచ్ఛ అతని సహజత్వం కాదు. ఇంద్రియాలతో అతనికి జరిగే సంగం వల్ల కామం (ఇచ్ఛ) ఉత్పత్తి అవుతుందని భగవద్గీత చెబుతుంది.

అలాగే బుద్ధి కూడ ! నేను గొప్పవాణ్ణి ! శక్తిమంతుణ్ణి, బుద్ధిమంతుణ్ణి అనే అహంకారం స్థూల ప్రకృతి సంపర్కంతో జీవునికి కల్గే దోషాలే ! ఈ దోషాలనే త్రిగుణాలన్నారు జ్ఞానులు. జీవన సహజత్వం లేదా దైవదత్తమైన శక్తి ఏది? దీన్నే జీవుడనీ, భూతమనీ, జ్ఞానశక్తులు కల్గి, యదార్థాన్ని తెలుసుకునే దానిని 'చిచ్ఛక్తి' అని అన్నారు. ఇంద్రియాలలో లిప్తం అయినపుడు ఈ చిచ్ఛక్తియే మనేంద్రియం అవుతుంది. అంతర్ముఖ స్థితిలో అదే 'చిచ్ఛక్తి'గా మిగులుతుంది. 'మనస్తత్వం' అని కూడ దానికి పేరు.

ఆ జ్ఞానశక్తి ఉన్న వ్యక్తే జీవుడు. లేదా మానవుడు. అలాంటి ముక్తి జీవులుండే లోకమే జీవలోకం లేదా గోలోకం. వారు సమస్త ప్రాణుల హితాన్ని ఎల్లప్పుడు కోరుతూ ఉంటారు. అలాంటి మానవులు దేవుడి నుండి పుట్టారు. వాళ్ళే దేవపుత్రుడు, క్రీస్తు !

ప్రపంచాన్ని పరిపాలించే నరుని శరీరంలో ఉత్తమాంగం ఉంది. అది శిరస్సు. ఆ శిరము నుండి చైతన్యరశ్మి వెలువడి రూపుదాల్చాక అదే సత్యప్రధాన బ్రాహ్మణ వర్ణం అయింది. బాహువుల నుండి వెలువడి రూపొందాక క్షాత్రప్రధానమైన రజోగుణ యుక్తమైన క్షత్రియ వర్ణం అయింది. జీవనోపాయానికి అవసరమైన వైశ్య వర్ణం పరమాత్మ 'ఊరు'వుల నుండి పుట్టింది. పాదాల నుండి ఈ మూడు వర్ణాల వారికి సేవలందించే సహనశీలి శూద్ర వర్ణం ఉద్భవించిందని పురుషసూక్తం చెబుతోంది. శూద్రవర్ణంలో అమాయకత్వం, శ్రద్ధ, ఆదేశపాలనం – ఇవన్నీ ఉన్నాయి. జాతి లేదా జన్మస్థలం ప్రధానం. జీవికి జన్మ పూర్వకర్మ ఫలానుగుణంగా కల్గుతుంది. వర్ణ సాంకర్యం, సహవాస దోషాదుల వల్ల ప్రగతి, అధోగతి

– రెండూ కల్గుతాయి. వాళ్ళు జాత్యతీతులు, జాతిభ్రష్టులు ఔతారు. త్రిగుణాతీతుడైన వ్యక్తే 'యోగి'. జాతిభ్రష్టులనే అస్పృశ్యులు, పంచములు మొదలైన శబ్దాలతో పిలుస్తాం. యోగియే నిజమైన మానవుడు. యోగి ఎల్లవేళలా సమత్వంలో ఉండే సర్వశక్తిమంతుడైన ఆత్మస్వరూపుడే. ఆత్మతోనే విశ్వమంతా వ్యాపించబడింది. అందువల్ల దానిని 'విష్ణువు' అంటాం. శాంతిలో నిలచిపోవడం వల్ల 'సదాశివుడ'ంటాం. ఆకారవికారాలు లేకుండా సర్వాన్ని తనలో ఇముద్చుకున్న చైతన్యం సృష్టికి మూలం. అదే లింగం! దీని నివాస స్థానం పరమధామం. ఆకాశం. అక్కడ ఆకాశం తప్ప ఇంకేమీ ఉండదు – అని వర్ణించారు జ్ఞానులు. గీతలో కూడా ఇలాగే చెప్పడం జరిగింది.

అలాంటి సర్వాతీతుడైన దేవుని, సర్వశక్తాత్ముని మనుష్యులు మనస్సున్న వాళ్ళు ! జ్ఞానులు ! పూర్ణుడైన దేవునిలో కోరిక లేదు. అతని అంశతో జన్మించిన మనుష్యులలో (దేవుడి నుండి కల్గిన జ్ఞానశక్తి ఉన్న వాళ్ళలో) ప్రకృతి సంపర్కం వల్ల కోరిక పుడుతుంది. అక్కడ ఆ జ్ఞానానికి ఆస్కారమే లేదు. నిర్వికారమైన శుద్ధ ప్రకృతే వారి నివాసం ! పంచ భూతాలు, సప్తధాతువులు – వీటి సంయోగంతో తయారైన అతని దివ్య దేహంలో కామాది వికారాలకు అవకాశం లేదు. దేహధారులైన వాళ్ళలో సదిచ్ఛమాత్రమే ఉంది. దాంతో అది మహాశక్తి సంపన్నం ! అందువల్ల సంకల్పశక్తితోనే సంతానం, ప్రతిసృష్టి జరుగుతూ వచ్చింది. క్రిందికి రాగానే స్వభావం, సహజత్వం తారుమారౌతుంది. మిశ్ర, అధమమైన నీచ ప్రవృత్తుల వల్ల సంకల్పశక్తే లేకుండాపోయి, దేహ సంయోగంతోనే సంతానోత్పత్తి జరిగే దుఃస్థితి ఏర్పడింది.

పరిశుద్ధ జ్ఞానులు, దేవపుత్రులైన, మనుష్యుల దేహాకారంలోనే మన దేహాలుండడం వల్ల మనల్ని మనము మనుష్యులమని భావిస్తున్నాం.

ఇది నిజం కాదు. మనం మానవప్రాణులం మాత్రమే ! ప్రాణులలో ఈ ఆకారం పొందిన జీవికి తనను తాను తెలుసుకుని, దేవుని దయతో జ్ఞాన వికాసమై మనుష్యత్వ ప్రాప్తి అయ్యేందుకు అవకాశముంది. అపుడు అతడు దేవపుత్రుడైన మనుష్యుడని అనిపించుకుంటాడు. అందుకే ఏసుక్రీస్తు తన్ను తాను "Son of God" అని ప్రకటించుకున్నాడు. దేవుని నుండి మనుషుల్లో ప్రవేశించి, బయటికి వచ్చి దేహధారణ చేయడం వల్ల 'Son of Man' అని కూడా చెప్పుకున్నాడు.

శ్రీరాముడికి శివుడుపదేశించిన 'శివగీత'లో ప్రాణులు నాల్గు రకాలని చెప్పబడింది.

1. అండజాలు (గుడ్డు పగిలి బయటికి పుట్టినవి)
2. స్వేదజాలు (చెమటలో పుట్టేవి)
3. ఉద్భిజాలు (ప్రకృతిఘర్షణ, తుఫాను, వానల్లో పుట్టేవి)
4. జరాయుజాలు (గర్భంలో పిండావస్థలో ఉండి పుట్టేవి)

ఇలా చూస్తే మనిషి ఆకారపు దేహం వున్న జరాయుజ ప్రాణులం మనం. పాతజన్మల సంస్కారం, ఈ జన్మ సహవాసం – వీటి ఫలితంగా వివేకశూన్యులై 'మానవ మృగాలు'గా మారిన వ్యక్తులు కూడా ఉన్నారంటే – దాన్ని అంగీకరించక తప్పదు. ఈ ఆకారంలో పుట్టిన ప్రాణుల్లో గ్రహణం చేసే శక్తి, మనఃశక్తి – కొంచెం ఎక్కువగానే ఉంది. ఆ వివేకాన్ని ఉపయోగిస్తూ జీవిస్తే మనుష్యులు అయ్యేందుకు సాధ్యమౌతుంది.

అజ్ఞానమే 'బంధనం'. ఇంద్రియ దాస్యం నుండి బయటపడటమే 'ముక్తి'. మనలో మనఃస్థితి యొక్క సమతోలనం (సమత్వం) అవసరం. అందుకే గీతలో 'సమత్వం యోగ ఉచ్చతే' అని చెప్పడం జరిగింది. యోగ విద్యాసాధన ద్వారానే ఇది సాధ్యం.

# 3. ధర్మం

'ధారయతీతి ధర్మః'. అన్నిటినీ ధరించేది ధర్మం. మానవ జీవనాన్ని సత్యభరితంగావించుకుని దైవకరుణను పొందేందుకు చేయాల్సిన ఆచారమే ధర్మమని నిర్వచించవచ్చు. ధర్మంలోని బాహ్యాభ్యంతర విషయాలను అవగాహన చేసుకోవాలి. శక్తి మరియు సత్సంప్రదాయబద్ధమైన ఆచరణ గురించి అర్థం చేసుకోవడం సమంజసం.

జీవితానికి చాలా అవసరమైంది ధర్మం. జననం నుండి మరణం దాకా దేహంలో జీవించే శక్తి పొందాలంటే ఎలా ధనం అవసరమో, అలాగే జీవుడు దేహంలో ఉండాలంటే ఈ ప్రాణధనం చాలా అవసరం! అందుకే శ్రేష్ఠ ప్రాణులమైన మనం మన దేహంలోని ప్రాణశక్తిని పరిపుష్టం చేసుకోవాలి. దాని కోసం ప్రాణవిద్యను గ్రహించి ప్రతిదినం ప్రాణ యజ్ఞాన్ని చేయాలి. ఆహారం, నీరు, నిద్ర, విహారాలు మితంగా, తగినంతగా ఉండాలి. సత్కర్మాచరణం జరగాలి. ఇలా చేస్తే ఆరోగ్యం బాగుండి జీవితం సుందరమౌతుంది. సర్వప్రాణుల మంచి కోసం అవసరమైన ద్రవ్య యజ్ఞం, ప్రాణ యజ్ఞాలను ప్రతిదినం చేయాలి. పరోపకారమనే పుణ్యకార్యాల వల్ల ఆయువు పెరుగుతుంది. శాంతి, ఉత్సాహాలతో కూడిన జీవితం సాధ్యమౌతుంది. దేవుణ్ణి గురించి తపస్సు చేయడం ద్వారా జ్ఞాన ప్రసాదాన్ని పొందగలం. ఇదే తపోయజ్ఞస్వాధ్యాయం (తనను తాను తెలుసుకోవడం వల్ల). సమస్త ప్రాణులకు దేవుడే మూలమని గ్రహించాక విశ్వ సౌభ్రాతృత్వ భావన చిగురించి జగత్తు శాంతి, ప్రేమ సహకారాల స్వర్గసీమగా మారుతుంది. జ్ఞానాన్ని అందరి మేలు కోసం ఉపయోగిస్తూ ధర్మకర్మా చరణతో ప్రజల సేవ చేసే వాడే యోగి. ఇదే జ్ఞానయజ్ఞం !

దేహంలోని స్థూల దోషాలను, జీవునిలోని సూక్ష్మకల్మషాలను కాల్చి పరిశుద్ధమైన ప్రాణాగ్నిలో ప్రాణాపాన గతిలో వాయు మథనంలో పుట్టిన అశనాన్ని హోమంగా అర్పించాలి. ఇది ప్రాణయజ్ఞం లేదా జపయజ్ఞం. ఇడ, పింగళ, సుషుమ్న అనే నాడులు (గంగ, యమున, సరస్వతి) చేరే స్థానం; దాన్నే గురుస్థానం అంటారు. జీవునిలోని పాపాన్ని, అజ్ఞానావరణ దోషాల్ని కాల్చివేసి, జ్ఞానదీపాన్ని వెలిగించేందుకు దోహద పడే ప్రాణశక్తియే గురువు. గురుస్థానం నుండి పృథ్వి దాకా (ఆజ్ఞాచక్రం నుండి నాభిదాకా) ప్రాణ స్పందనలో పుట్టే వాయువును దాని సహజ ప్రాణాపానగతిలో ఆరోహణావరోహణ క్రమంలో నడిపిస్తూ మధించడమే ప్రాణయజ్ఞం లేదా ప్రాణాయామం.

అందులో పుట్టిన శుద్ధ విద్యుత్సారమే అశనం. ప్రాణశక్తి పరిపుష్టం అయ్యేందుకు అవసరమైన సూక్ష్మాహారాన్నే ప్రత్యాహారమంటారు. దీనితో పరిపుష్టమైన ప్రాణం పైకి ఎక్కి ఆత్మతో కలిశాక ఏకాగ్రత సాధ్యం ఔతుంది. ఆ ఏకాగ్రమైన మనస్సుతో ధ్యానం (దేవుని స్మరణ, చింతనం, ప్రార్థన, ఆత్మ నివేదన) చేయాలి. అభ్యాసంతో ఈ ధ్యాన స్థితిని పొడిగించు కోవచ్చు. ఇదే ధారణ ! దీని వల్ల జీవాత్మ సంబంధం కల్గడమే సమాధి. స్థితప్రజ్ఞత్వం ! ఇది అష్టాంగయోగంలో ప్రధానమైనది. యమ, నియమ, ఆసన, ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహాలకు, చాలాసేపు ధ్యానంలో కూర్చునేందుకు సుఖమైన, స్థిరమైన ఆసనాలు అవసరం.

యోగాసనాల్లో అనేకమైన ఆసనాలు యోగవిద్యతో సంబంధం లేనివే ! శారీరక వ్యాయామాలు మాత్రమే. శ్వాసాయామం కూడా శ్వాసతో చేసే వ్యాయామం. హఠయోగమే ! నిజమైన యోగం కాదు. దీని వల్ల ఆకాశగమనం లాంటి సిద్ధుల్ని పొందవచ్చు. నాడీశుద్ధి జరిగి సూర్య,

చంద్రనాదుల్లో శ్వాస ఆడేవేళ కార్యం చేస్తే అది సిద్ధిస్తుంది. ఇచ్ఛామరణం పొందేందుకు ప్రాణపుష్టి అవసరం. దానికి ఉపయోగపడేదే ప్రాణాయామం. "సర్వద్వారాణి సంయమ్య, మనోహృది నిరుధ్యచ మూర్ధ్నా ధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణాం" అని గీత చెబుతుంది. ఈ సాధనా క్రమాన్ని గురువు నుండి పొందాలి. మాటల ద్వారా చెబితే అది అర్థం కాదు. దగ్గర్లో కూర్చుని గురువు, విద్యార్థికి తాను చేసి చూపించాలి. చేసే వాళ్ళ ప్రాణవాయు మథనంలో ఏర్పడే ప్రణవనాదాన్ని వింటూ ఉండే విద్యార్థి యొక్క దేహంలోని ప్రాణవాయువులో సహజమైన గతాగతి ప్రాప్తమౌతుంది. ఇదే ఉపదేశం ! లేదా విద్యాదాన క్రమం ! ఇదంతా జీవుని దేహంలోని ధారణాశక్తి, ధర్మం గురించిన అంశం.

జీవి యొక్క స్థూల జీవితం సుఖశాంతులతో, ఉత్సాహంతో కొనసాగేందుకు అన్యోన్యప్రీతి, సహకారం, ఉపకారం, త్యాగం ఇవన్నీ చాలా అవసరం. ఇవన్నీ పెరగాలంటే వైయక్తిక, సామాజిక సదాచారం, సంప్రదాయం అవసరం. సదాచారాలతో కూడిన సంప్రదాయం పెరిగేందుకు నియమాలు అవసరం. ఆ నియమాలతో కూడుకున్న శాసనమే ధర్మశాస్త్రం. దీనిలో మనువు కొన్ని మార్పులు చేస్తూ వచ్చాడు. మధ్య మధ్యలో కాలానుగుణంగా మహర్షులు కూడా కొన్ని మార్పులు చేశారు. దీన్నే బాహ్య జీవితంలో ధర్మం అంటారు. వ్యక్తి మరియు సమాజపు సుఖశాంతులకు, శ్రేయస్సుకు ఇది చాలా అవసరం.

(1) ధర్మం (వైయక్తికం) : విద్యార్థి దశలో అవసరమైన స్థూలబ్రహ్మ చర్యం, శుచిత్వం, వినయం, సాత్వికాహారం, భిక్షాజీవనం, గురుసేవ, స్థూల విద్యార్జన, తపస్సు, అహింస, అస్తేయం ఇవన్నీ 'ధర్మం' అనబడతాయి.

(2) విద్యార్థి దశ తర్వాత గృహస్థ కర్తవ్యాలైన సొంత ధర్మం, సతి ధర్మం, పితృధర్మాలు, మిత్రధర్మం, ప్రజాధర్మం, ఆపద్ధర్మం, ఆప్త ధర్మమైన తపస్సు మున్నగునవి.

(3) సాంసారిక బాధ్యతలు ముగిశాక కేవల జ్ఞానప్రాప్తి, ముక్తి సాధనలకై అవసరమైన ఆ పరిపాలించే ప్రభువే సెలవిచ్చినట్లుగా Teacher King తత్వజ్ఞుడైన ఆదర్శగురువే ప్రభువు కావాలి. అపుడే లోక కల్యాణం. అలాంటి యోగి ప్రభువై ధర్మశాస్త్రాన్ని తిరగ రాయాల్సిన సమయం ఆసన్నమైనది. ప్రాచీన జ్ఞానులు ఈ పర్వకాలాన్ని తమ జ్ఞానదృష్టితో ముందే ఊహించి వైవస్వత మన్వంతరం ముగిసి 'సూర్యసావర్ణి మన్వంతరం వస్తుంది' అని జోస్యం చెప్పారు.

# 4. మానవుని చరిత్ర

సృష్ట్యాదియే మానవ చరిత్రకు పునాది. ఏకాణు, ద్వ్యణు, త్ర్యణు సూక్ష్మక్రిములతో మొదలై, కోతిగా మారి తర్వాత మానవుడుగా పరిణమించాడని డార్విన్ వాదం. అయితే భారతీయ తపస్సుల పరిణామ క్రమం దీనికి విరుద్ధంగా వుంది. మనం యోగవిద్యలో కనిపెట్టిన 40 సంవత్సరాల అనుభవం, పూర్వకాలంలో తపస్వులు చెప్పిన అనుభవానికి చాలా దగ్గర్లో వుంది.

బైబిలులో పాత నిబంధనలో మోశె “దేవుణ్ణి చూశావా?” అనే మిత్రుని ప్రశ్నకు “ఔను దేవుణ్ణి చూశా” అనే బదులు ఇస్తాడు.

మిత్రుడు : In blood and flesh ? (మనలాగే రక్తమాంసాలతో కూడిన దేహరూపంలోనా?

మోశె : No, not in blood and flesh, but in light and voice (రక్తమాంసాల రూపంలో కాదు, వెలుగు, మాటల రూపంలో)

భారతీయ మహర్షులు చెప్పినట్లుగా మూల చైతన్యం మోశెకు ప్రకాశరూపంలో గోచరించిందనిపిస్తుంది. అందుకే మన ఋషులు దాన్ని 'పరంజ్యోతి' అన్నారు. కొన్నిసార్లు జ్యోతిదర్శనం కావడం వల్ల భక్తులకు తృప్తి కల్గుతుంది. జ్యోతి ఉత్పత్తి మన చైతన్యంలోంచే ! మరి వెలుగు చేతనం కాదా? చాలామంది ఋషులకు కేవలం మాటలు మాత్రమే విన్పించాయి. కొందరికి అలా కాకుండా చాలా ఉన్నతస్థాయికి చెందిన "శాంతి" అనుభవం కల్గింది. దాని వల్ల తృప్తి, ఆనందానుభవాలు కల్గాయి. కైవల్యధామ శాంతి (నిశ్శబ్దం బ్రహ్మముచ్యతే బ్రహ్మ ఇతి వ్యజానీయాత్) ఉండే చోట శబ్దమూ లేదు. దానికి దగ్గరగా ఉండే అనుభవమే "శాంతి", "ఆనందానుభవములు" ! అని అనుభవజ్ఞులు వివరించారు.

ఈశావాస్యోపనిషత్తు మాత్రమే వేదాంతమని అంగీకరించవచ్చు. మిగతా ఉపనిషత్తులన్నీ వేదాలకు తమకు తోచినట్లుగా వేరు వేరు మహర్షులుచేసిన వ్యాఖ్యానాలని దయానందసరస్వతి గారి అభిప్రాయం. అయితే మిగిలిన ఉపనిషత్తుల్లాగానే ఈశావాస్యం కూడా ఓ మహర్షి వేదాలకు చేసిన వ్యాఖ్యానం. తాను తెలుసుకున్నంత మేరకే అనేది నిజం.

ఎందుకంటే ఆ మహర్షి ఆ ఉపనిషత్తులో తాను పొందిన అనుభవాన్నే వర్ణించాడు. మహాతీక్ష్ణమైన కిరణాలుండే బంగారు రంగు గల ఒక కాంతి వలయాన్ని అతడు చూశాడు. దాన్నే హిరణ్మయపాత్రగా వర్ణించి దాని మధ్యలో సత్యం దాగి వుందని అన్నాడు. "ఆ తీక్ష్ణ కాంతి కిరణాలను భేదించి నేను నిన్ను చూడజాలకున్నాను. ఆ కిరణాలను

నీలో అంతర్విితం చేసుకో ! అపుడు నీ దర్శనం నాకు కల్గుతుంద”ని ప్రార్థించాడు. ఆహా ! నిజంగా ఆశ్చర్యం ! ఆ కిరణాలు అదృశ్యమయ్యాయి. ఆ పరమ పురుషుణ్ణి చూశాడు ! ఆ ధన్యపురుషుడే నేను అని ఆనందంతో మహర్షి ఉద్ఘోషించాడు. ఆయన తన తపస్సులో చూసింది పరబ్రహ్మను! ఏకర్షిని ! హిరణ్మయ పురుషుణ్ణి ! పరమాత్మను ! అనే జ్ఞానులు పలికారు. అతడే హిరణ్యగర్భుడు. ఇంకెవరూ కాదనే విషయం వేద పురాణజ్ఞులకు ఇట్టే అర్థమవుతుంది. ఇతడే వేదాల్లో చెప్పబడిన రెండవ పురుషుడు. మొదట ఉండిన వ్యక్తి శివుని కంటి మంటల్లో దగ్ధుడైన కామదేవుడు. అతని కన్న మొదట ఉన్న పురుషుణ్ణే శ్వేతాశ్వతరోపనిషత్తులో మహర్షి ‘ఆదిలో రుద్రుడొక్కడే ఉండేవాడు. అతడు ఆత్మను సృష్టించాడు’ అంటాడు. ఇక్కడ ‘ఆత్మ’గా వర్ణించబడింది త్రిమూర్తుల్లో ఒకడైన బ్రహ్మ. సృష్టిలో వచ్చిన వాళ్ళంతా జీవులుగా ఇప్పటికీ పరిగణింపబడుతున్నారు. “పిపీలికాది బ్రహ్మపర్యంతం జీవరాశయః’ అనే మాట దీన్నే నిర్ధారిస్తుంది. రుద్రుని భయంతోనే దేవతలంతా తమ తమ కర్తవ్యాల్ని పాలిస్తున్నారు. సూర్యచంద్ర మండలాలు నిశ్చితమైన గతిలో ఉన్నాయని ఆ మహర్షి చెప్పాడు. ఈ రుద్రుడు త్రిమూర్తులలో లయకర్త అనిపించుకున్న రుద్రుడు కాడు. అతడు మహారుద్ర దేవుడనిపించుకున్నాడు అజ్ఞానుల నోటిలో ! ఆది రుద్రుని భ్రుకుటి మధ్యలోంచి పుట్టిన మహారుద్రుడు అతడు.

ఇలా పరిశీలిస్తే ఆదిరుద్రుడు లేదా ఆదిపురుషుడు అంటే బైబిల్‌లోని మాటలు స్మృతిలో మెదలాలి. దేవుని సింహాసనాన్ని మోసే నాల్గు ప్రాణుల్లో మృగముఖం కల్గిన ప్రాణి ఒకటుంది. అదే ముఖ్య ప్రాణం. ఇలా దయానంద సరస్వతి గారు వేదాంగమని వర్ణించిన ఈశావాస్యోపనిషత్తు కన్న శ్వేతాశ్వతరోపనిషత్తు ప్రాచీనమని నిర్ణయించక తప్పదు. ఈశావాస్యం అనేది మిగతా ఉపనిషత్తుల్లాగానే వేదానికి ఒక మహర్షి చేసిన వ్యాఖ్యానమే!

ఈ మహర్షులంతా బ్రహ్మసృష్టిలోంచి వచ్చిన జీవులే తప్ప ఏకర్షిలా ఉద్భవించిన పరమాత్ముని పుత్రులు కాదు. గీతలో చెప్పినట్లుగా పరమాత్మ నుండి పుట్టిన కొడుకులు నల్గురు. వాళ్ళే ముఖ్యప్రాణుడు, కాముడు, హిరణ్యగర్భుడు, ఆదివిష్ణువు అనిపించుకుని హిరణ్యకశ్యపదేహంలో ప్రవేశించి పుట్టిన ప్రహ్లాదుడు నాల్గవ కొడుకు.

ఛాందోగ్యోపనిషత్తులో 'దేవుడు తన చిన్న కొడుకైన బ్రహ్మకు సృష్టించే అధికారాన్నందించి పెద్ద కొడుకైన ముఖ్యప్రాణునికి ప్రపంచ పరిపాలన, పర్యవేక్షణల కర్తవ్యాన్ని అప్పజెప్పాడన్న మాటల్ని గమనించాలి. ఆదిపురుషుడైన ముఖ్యప్రాణదేవుడు కుమారసర్గలో వున్నవేళ – పరమాత్మకు మూలప్రకృతి ప్రార్థన మేరకు ద్వితీయపుత్రుడనిపించిన ఆత్మ–జీవం ఉద్భవించి పురుషశరీరం ద్వారా క్రిందికి దిగి, రూపం దాల్చి శంకరుడు, భవుడు, దక్షిణామూర్తి, గురువు అనిపించుకున్నాడు. ఇతని దేహం ఎడమ భాగం నుండి ఒక జీవుడు, ప్రకృతి దేవి శరీరం ద్వారా ఇతని శరీరంలో ప్రవేశించి, బయటికి వచ్చి 'భవాని', 'శంకరగౌరి'గా పిలువబడ్డారు. వీళ్ళుండే స్థానమే గోలోకం.

'విష్ణుపురాణం'లో ఆదిపురుషుడు కుమారసర్గలో తపస్సు చేసి, క్రిందికి వచ్చి పాలసముద్రంలో పవళించి తన ఆత్మ అయిన (పుత్రుడైన) బ్రహ్మను సృష్టించాడని రాయబడింది. క్షీరసాగర మధ్యంలో ఒక గ్రుడ్డు పుట్టింది. అది పగిలి మధ్యలోంచి మహావర్చస్సుతో కూడిన బ్రహ్మ (పెద్ద వ్యక్తి) ఉద్భవించి 'నారాయణు'డని అనిపించుకున్నాడని మరోచోట రాయబడింది. విష్ణుపురాణం రాసిన పరాశరునికి జరిగిన మిత్రభ్రంశం వల్ల ఇలా సృష్టికార్యపు సహజవ్యాపారాన్ని సరిగ్గా గ్రహించడం జరగలేదని చెప్పక తప్పదు.

నా తపస్సులో నేను దర్శించింది ఇది ! 'క్షీరసాగరంలో ఎవరూ లేరు'. "అహమేవ నారాయణః" (నేనే నారాయణుడను) అనే మాట విన్పించింది. అపుడో దివ్యపురుషుడు ఉద్భవించి ఆ జలరాశి పై నిలబడి మళ్ళీ "అహమేవ నారాయణః స్వయం" అన్న మాటలు విన్పించాయి. ఆ దివ్యపురుషుడు తన ఎడమ చేతితో నీటిపై ఒక స్థలాన్ని చూపించాడు. అక్కడ ఓ కమలం పుట్టింది. దాని పై ఒక దివ్య స్త్రీ నిలబడినట్లు కన్పించింది. ఆ మాటలు వచ్చింది ఆదిపురుషుని ముఖంలోంచే అని నా భావన. పరమాత్ముని ఒక చైతన్యకిరణం పురుషుని దేహం ద్వారా బయటికి వచ్చి దేహాన్ని ధరించినట్లు గోచరించింది. నారాయణుని మరో కిరణం కమల సరోవరంలో అంతర్ముఖుడై కూర్చున్న యోగి (మూల ప్రకృతి) బయటికి వచ్చి రూపం దాల్చిన నారాయణుని ప్రియదర్శిని – నారాయణి, ఇందిర, లోకమాత, జలాభిమానిదేవత అనిపించుకున్న గంగాభవాని. నారాయణుడే త్రిమూర్తుల జననానికి కారణం అనిపించింది. వారందరిపై అధికారి, సృష్టి, స్థితి, లయాధికారాలున్న సర్వతంత్ర స్వతంత్రుడూ, గుణ పరిపూర్ణుడూ అయిన పరమాత్ము (పుత్రశ్రేష్ఠుడు) అనిపించాడు.

బ్రహ్మ అనిపించుకున్న త్రిమూర్తుల్లో ఒకడైన జీవి నారాయణుని దేహం ద్వారా బయటికి వచ్చి రూపుదాల్చడం వల్ల గీతలో నా పుత్రుడని చెప్పబడలేదు. 'బ్రహ్మ' అనే శబ్దాన్ని గీతలో కానీ, ఉపనిషత్తులో కానీ ఏ వ్యక్తి విషయంలో ప్రయోగించడం జరగలేదు. గీతలో అతనిని 'ప్రజాపతి' అనడం జరిగింది. ఆదివిష్ణువును (నారాయణుని కోరిక ప్రకారం పుట్టిన విష్ణుమూర్తి) పుత్రుడని చెప్పడం జరిగింది. మూలచైతన్యాన్నే విష్ణువన్నారు. ఈ నలుగురిని దాని భుజాలుగా వర్ణించి, దానికో రూపం కల్పించి "చతుర్భుజుడు' గావించి ఆరాధించారు.

ఆది రాక్షసులైన మధుకైటభులు నారాయణుని నుండే పుట్టారు. ప్రజాపతిని పట్టుకున్నారని దేవీ భాగవతం చెబుతుంది. ప్రజాపతి ప్రార్థించగా మాయాదేవి నారాయణుని మేల్కొల్పింది. అపుడు యుక్తితో నారాయణుడు వాళ్ళను సంహరించాడు.

ఈ బాధ్యతలతో కూడిన స్థానం తనకు అక్కరలేదని అతని ప్రార్థన యొక్క ఫలంగా అతని దేహం ద్వారానే ఉపబ్రహ్మ, ఉపబ్రహ్మిణులు పుట్టారు. వారికి క్షీరసాగర సామ్రాజ్యం ఆదినారాయణుని వల్ల దక్కింది. మున్ముందు అతడు తులసి శాపంతో శిలగా మారాక, ఆ స్థానాన్ని బ్రహ్మర్షి శ్రేష్ఠుడైన అత్రి మహర్షి అలంకరించాడు. అనసూయాదేవి మహాలక్ష్మి అనిపించుకుంది.

దేవాసురులు చేరి అమృతం కోసం పాలకడలిని మధించారు. కారణమేమి? 'ఆత్మ' (మూల చైతన్య దేవుడు)లోంచి పుట్టి వచ్చిన ప్రాణం మరియు జీవరాశుల సమూహం ఆ స్థానంలో నిజంగా చేరి ఉన్నది. దాన్ని సదుపయోగం చేసుకునేందుకే దాన్ని చిలకడం అవసరమైంది.

అన్ని లోకాలకన్న పైన ఉండే కుమారసర్గలో ఉండే మేరు పర్వత శిఖరాలలో (మహావిష్ణు స్థానం కన్న పై స్థానంలో) అత్యున్నతమైనది మందరగిరి. అంతర్ముఖంగా ఉన్న ఆ పురుషుని దేహాన్ని మోసుకుని వచ్చి, తెచ్చి, వాసుకి అనే సర్పాన్ని చుట్టి మధించారు. చాలా వస్తువులు పుట్టాయి. పురుషుని శరీరంలోని ప్రాణశక్తి తగ్గిపోయి, మొదటి స్థానానికి పెరిగి పోజాలక మహావిష్ణుని దక్షిణ హస్తం మనిపించి అతని ప్రక్కలో కూర్చున్న యోగి అనిపించుకున్నాడు. గంగాదేవి కమల సరస్సును ఆశ్రయించి కమలాసన అయింది. మూలప్రకృతి క్షీరసాగరంలో పుట్టి విష్ణుపత్ని అయింది. ఆదివిష్ణువు దేహాన్ని విసర్జించగా ఆమె (సతి)

పతిలేనిదిగా మారింది. దాక్షాయణి పార్వతిగా పుట్టింది. పురుష స్థానాన్ని వదలిన కామదేవుడు రుద్రుని నేత్రజ్వాలలకు బలై అస్తమించాడు.

దాక్షాయణి పార్వతిగా పుట్టి రుద్రాణి అయింది. రుద్రుడు ఆమెను చూసి మోహించలేదు. ఆమె గౌరిలో (ఆదిగౌరి - మూలప్రకృతి) ప్రవేశించాక ఆ దేహం గౌరవర్ణయుక్తమైంది. అపుడు రుద్రుడు మోహితుడై నాడు. దాక్షాయణి బయటపడి ఒక గుప్తస్థానంలో (మహా విష్ణువుని హృదయం) చేరి "కౌశికీశక్తి" అనిపించుకుంది.

కుమారావతరణ తర్వాత రుద్రుని శరీరంలోని మూలప్రకృతి (ఆదిలక్ష్మి) శ్రీరామావతారంలో భూగర్భంలో పుత్రికగా లభించిన సీతామాత అనిపించుకుంది. కౌశికీశక్తి పార్వతి అనబడే దేహంలో మళ్ళీ ప్రవేశించింది. రామునిచే పరిత్యజింపబడిన సీత భూగర్భంలోకి చేరి పతి కోసం శివుణ్ణి ఉద్దేశించి తపస్సు చేసింది. ఐదుసార్లు కోరడం వల్ల ఐదుమంది భర్తలు లభిస్తారని శంకరుడు వరమిచ్చాడు. దాని ఫలితంగా మహా భారతయుద్ధకాలంలో యజ్ఞకుండంలోంచి జన్మించి యాజ్ఞసేని అనిపించుకున్న ద్రౌపది పంచభర్తృక అయింది ఆదిలక్ష్మి. అగ్నిదేవుడే దృష్టద్యుమ్ను డనిపించుకుని వచ్చాడు.

ఇదంతా రాసేందుకు కారణమేమంటే - మానవ చరిత్రను ఉన్నదున్నట్లు చెప్పడం లేదా రాయడం యోగులకు కూడా సాధ్యం కాదు. అందుకే గీతలో 'నేను అందరినీ ఎరుగుదును. నన్నెరిగిన వారెవరూ లేరు' అని భగవంతుడు సెలవిచ్చాడు. మహాతపస్వులు అయిన ఉపనిషన్మ హర్షులకు, పురాణకర్తలైన మునులకూ పూర్తిగా అర్థం కాని సృష్టి రహస్యాన్ని తపస్వులు కాని ఆధునిక విజ్ఞానులు ఎలా తెలుసుకో గల్గుతారు?

సృష్టి వికాసక్రమాన్ని తపస్సు ద్వారా తెలుసుకొన్నప్పుడు జలం పుట్టి సర్గలోని భూమిలో ఒక జాతి సస్యం పుట్టింది. అదే దర్భ. తర్వాత ఎడమ వైపు ఉండే కమల సరోవరంలో కమలపు తీగ, కుడివైపున ఉండే శ్వేతకల్పంలో ఒక మహావృక్షం ఉంది. క్షీరసాగరమనే స్థానంలో వృక్షం, సస్యం ఇవేవీ కన్పించవు. సత్యలోకంలో సస్యవర్గం ఉంది. ఇంద్రాది లోకాల్లో ఉంది. (సూర్యమండలం) అది అగ్నిగోళం. సస్యవర్గం లేదా జీవులుండడం అసాధ్యమని విజ్ఞానవేత్తలు అంటారు. ఇదంతా వారి భ్రమ ! అజ్ఞానం ! గ్రహాలన్నిటిలో శీతలగ్రహమనిపించుకున్న సూర్య మండలంలోనూ జీవులున్నారు. వాళ్ళనే ఈ మర్త్యలోకపు మనుషులు దేవతలన్నారు.

మున్ముందు భౌతిక విజ్ఞానం ఇంకా బాగా అభివృద్ధి అవుతుంది. ఇక్కడిజీవులు సూర్యమండలం దాకా కూర్చుని ప్రయాణం చేయగల్గే అంతరిక్ష వాహనాల్ని తయారు చేయగల్గుతారు. అపుడు వాళ్ళకు నమ్మకం కల్గుతుంది. ఇపుడు నేను రాసిన మానవేతిహాసం సత్యం అని అనిపిస్తుంది.

సృష్టిలో మొదట పుట్టింది సస్యజాతి. తర్వాత మానవజాతి. ఆ తర్వాత ప్రాణులు, పక్షులు, మృగాలు, కీటకాదులు పుట్టాయి. ఉపప్రజా పతుల స్పర్థలు, మత్సరద్వేషాదులు సర్ప మృగసృష్టికి కారణమైంది. స్వర్గంలా ఉండాల్సిన సృష్టి నరకప్రాయమైంది. అందుకే ప్రజాపతి సంకల్పంతో సృష్టి చేయడం ఆపి, స్త్రీ పురుష సంభోగం వల్ల సంతానం పెరగాలనే నియమాన్ని ఏర్పరచాడు. తర్వాతి కాలంలో నడుస్తూ వచ్చిన మానవేతిహాసమే 18 పురాణాలు, ఉపపురాణాలు. ఇవన్నీ చరిత్రలో లిఖించబడ్డాయి. అందులోనూ రాయని అంశాలు, ఇంకోరకంగా చెప్పబడ్డ విషయాలూ ఉన్నాయి. దీనితో ఈ ఇతిహాసం దోషభరితంగా ఉందని చెప్పక తప్పదు.

# 5. ధర్మం యొక్క అంతర బాహ్యా స్థితులు

ధర్మం గురించి, దాని బాహ్యాభ్యంతరాల గురించి కొంత తెలుసు కున్నాం. ఇపుడు ఇంకా కొన్ని వివరాల్ని గ్రహిద్దాం. ధర్మధారణా శక్తి మన దేహంలో ఏది? ప్రాణం ఉండేంత దాకా జీవం (ఆత్మ) దేహంలో ఉండగల్గుతుంది. ఈ ప్రాణమనే శక్తి దేహంలోంచి బయటికి వెళ్ళిపోతే – "నేను అనే జీవాత్మ దేహంలో ఉండలేక బయటికి వెళ్ళి పోతుంది. చాలామందికి 'ప్రాణం', 'జీవం' అంటే ఏమిటో తెలియదు.

ఈ దేహమనేపురంలో 'జీవుడు' 'ప్రాణుడు' అనే రెండు శక్తు లున్నాయి. దీన్నే గీతలో 'ద్వావిమౌ పురుషౌ లోకే క్షర శ్చాక్షర ఏవచ, క్షరస్సర్వాణి భూతాని కూటస్థోక్షర ఉచ్యతే' అని చెప్పబడింది. (ఈ దేహమే ఒక పురం. ఇందులో నివసించే రెండు శక్తులే ఇద్దరు పురుషులు. ఒకదానికి నాశం ఉంది. రెండోది కూటస్థం ! అక్షరం. కూటస్థం అంటే రెండింటి కలయికకు కారణమైనది. ఏ రెండింటి కలయికకు ? ఈ దేహంలో ఉండే జీవుడు, దాని మూలమైన చైతన్యం (ఆత్మ – పరమాత్మ) అనే రెండింటి కలయికే యోగం. ఆ కలయికకు కారణమైనదే ప్రాణశక్తి. ఈ ప్రాణశక్తి జీవునితో కలసిన వేళ మనస్సుకు (జీవునికి) ఏకాగ్రత వస్తుంది. చాంచల్యరహితమైన ధ్యానంతో తపస్సు సాగి దేవునితో సంబంధం జీవునికి ఏర్పడేందుకు సాధ్యమౌతుంది. అంతే కాదు. ఈ జీవం పుట్టేందుకు, మళ్ళీ అక్కడికే వెళ్ళి చేరేందుకు ఈ ప్రాణశక్తియే సాధనమౌతుంది. ఆత్మలోంచి మొదట పుట్టింది ప్రాణశక్తి. అది పుట్టి, బయటికి వస్తూ, క్రిందికి ప్రవహిస్తూ ఆత్మ ఆకర్షణ వల్ల ఒక్కోసారి కొంత ప్రాణశక్తి ఆత్మలో ప్రవేశించాక ఆత్మకు శాంత స్థితి వల్ల ఆనందానుభవం (సుఖానుభవం వల్ల కల్గే హర్షాతిరేకం) కల్గుతుంది. అపుడు మళ్ళీ బయటికి

వచ్చిన ప్రాణశక్తి జ్ఞానశక్తితో కూడిన జీవచైతన్యం అనిపించుకుంటుంది. ప్రాణశక్తి కూడా కేవలం క్రియాశక్తి. అందులో మనస్సే (జ్ఞానశక్తి) లేదు. అందుకే ఓ ఉపనిషన్మహర్షి దాన్ని "వామన" అని వర్ణించాడు. ఈ ప్రాణశక్తి ద్వారానే జీవుడు దేహంలోకి ప్రవేశించేది. అక్కడ తన ఇచ్ఛ ప్రకారమే ఆత్మచే ఆకర్షింపబడి, అందులోకి చేరి తన అస్తిత్వాన్నే పోగొట్టుకుంటాడు. దీన్నే "సాయుజ్య మోక్షం,", "విదేహముక్తి" అంటారు.

తన ఇచ్ఛకొద్దీ ఈ జీవం అమరమూ కావచ్చు. అందుకే కష్ట సుఖాల్ని సమానంగా అనుభవించే ధైర్యం అవసరం. ధైర్యం రావాలంటే జ్ఞానం పూర్ణంగా వికసించాలి. విసుగు రాకుండా ఉండాలంటే – ధర్మ నిరతి, కర్మనిరతి కావాలి. ఇవి లేకుంటే మరణమే శరణ్యం అవుతుంది. అందుకే ఆత్మనే (మూల చైతన్యాన్నే) ఓ ఉపనిషన్మహర్షి 'ఆదిలో మృత్యువు ఒక్కటే ఉన్నది. అది ఆత్మను సృష్టించింది' అని చెప్పాడు. కఠోపనిషత్తులో నచికేతుడు మృత్యువశుడై పోయాక, యమునితో 'ఆత్మ ఉందని కొందరు, లేదని కొందరంటారు ! దీని విషయంలో మీ నిర్ణయం ఏమిటి? అని ప్రశ్నిస్తాడు. కేవలం దేహత్యాగం గురించి మాత్రమే నచికేతుడు అలా అడగలేదు. భూలోకంలోంచి యమలోకానికి చేరాక, స్థూల శరీర త్యాగం చేశాడు. ఆ అనుభవం అతనికి తెలుసు. అందుకే తనకు స్థూలశరీరం ప్రాప్తించి, తాను తన ఇంటికి వెళ్ళిన వేళలో తండ్రి వాజశ్రవుడు తన్ను గుర్తించాలనే వరాన్ని కోరుకున్నాడు.

చాలామంది అనుకున్నట్లుగా ఈ జీవుడు (ఆత్మ) నాశరహితం కాదు. క్షరమే ! ప్రాణశక్తి మాత్రం అక్షరం. ఎల్లప్పుడూ ఉండేది. అందుకే ప్రాణవిద్యను "అక్షరవిద్య" అనడం పరిపాటి. కఠోపనిషత్తులో దీన్నే 'అవిద్య' అన్నారు. ఈ అవిద్యలో మృత్యువును దాటి విద్యతో అమృతత్వాన్ని

పొందవచ్చు అని చెప్పబడింది. గీతలోనూ "సుఖదుఃఖ సమాఃధీరాః అమృతత్వాయ కల్పతే" అని చెప్పబడింది.

**"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్టతి**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా"**

అనడం జరిగింది. 'ఈశ్వరః' శబ్దం 'ఈశ్' ధాతువు నుండి పుట్టింది. ప్రాణం దేహంలో హృదయస్థానంలో స్పందిస్తూ ఈ దేహ యంత్రాన్ని ఆశ్చర్యకరంగా నడిపిస్తోందని దీని భావం. దీన్నే ఉపనిషన్మహర్షి ఇలా వివరించాడు. "ప్రాణశరీర నేతా ప్రతిష్ఠితోన్నే హృదయం సన్నిధాయ, తద్విజ్ఞానేన పరిపశ్యంతి ధీరాః ఆనందరూపమమృతం యద్విభాతి" (ఈ శరీరంలో ముఖ్యశక్తి అయిన ప్రాణంలోంచి పుట్టిన వాయువు ఐదుగా విభక్తమై ముఖ్యమైన ప్రాణవాయువు హృదయంలో ప్రతిష్ఠితమైనది. ఈ అంశాన్నిబాగా గ్రహించి ప్రాణవిద్యా సాధనలో సాగే ధీరులు ఆనందాన్ని సహజంగా పొంది అమృతులౌతారు) అని ఉపనిషత్తు చెబుతోంది.

ఈ ప్రాణమే జీవనధర్మం లేదా ధర్మపు ఆంతరిక స్థితి. దేహ పోషణకు, ధారణలకు దేహం వెలుపల స్థూలప్రకృతిలోని వస్తువుల అవసరం ఉంది. దేహధారి అయిన జీవునికి గాలి, నీరు, ఆహారం ఇవన్నీ ధర్మపు బాహ్యాంగాలు.

ప్రాణులలో – అందులోనూ మనిషి సంఘ జీవి. అతడు నివసించే సమాజంలోని జీవులందరి సేవ, సహకారం, క్షేమం అతని జీవనం సజావుగా సాగేందుకు అవసరం. అందుకే పరస్పర స్నేహసహకారాలతో జీవించాలి. ఏ వ్యక్తి కూడా చాపల్యానికి గురై, అత్యాశను పెంచుకుని, పరుల పీడనం, క్రోధం, ద్వేషాలకు కారణం కాకూడదు. అలా అయితేనే సమాజంలో అభివృద్ధి, శాంతి, స్నేహభావనలు వికసిస్తాయి. దీనికి

అవసరమైన సామాజిక నియమాల గురించి జ్ఞానులు ఆలోచించి ధర్మనియమాలను ఏర్పరచారు. అలాంటి ధర్మ శాస్త్రాలే మనుస్మృతి, పరాశర స్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి – వంటి గ్రంథాలు. కాలానుగుణంగా ధర్మపు బాహ్యాంగాలలో జ్ఞానులు తగిన మార్పుల్ని చేస్తూనే వచ్చారు. ఉదాహరణకు గృహస్థాశ్రమాన్ని స్వీకరించుకునే వయస్సు ఒకానొకప్పుడు 48. కాలక్రమంలో 32, 24, 16 ఇలా మారుతూ ఇపుడు మళ్ళీ 25–30 సంవత్సరాలకు చేరుకుంది.

ఈ ధర్మనియమాల్లో నిత్య (ప్రతిదినం చేయాల్సినవి), నైమిత్తిక (కారణం కోసం సర్వకాలాదులకు పరిమితమైనవి) భౌతిక (స్థూల జీవనానికి మాత్రమే పరిమితం), పారమార్థిక (దేహ త్యాగానంతరం సద్గతికి సంబంధించినవి) నియమాలు అంతర్భవిస్తాయి. లౌకిక ధర్మ నియమాల్లో ప్రజాధర్మం, మిత్రధర్మం, పుత్రధర్మం, కళత్ర ధర్మం, వర్ణాశ్రమ ధర్మాలు మొదలైనవి ప్రధానాలు.

పైన చెప్పినవన్నీ ఒక్కో దేశానికి పరిమితమైనవి. మానవుల ప్రయత్నానికి అందని ప్రకృతితో ఆశ్చర్యకరంగా ఒక్కో సమయంలో మాత్రమే కన్పించే కాల (యుగ) ధర్మమూ ఉంది. ఒకానొకప్పుడు మనిషి ఆయువు 1000 సంవత్సరాలు. కాలక్రమంలో 500, 200, 100, 90 ఇలా తగ్గుతూ ప్రస్తుతానికి 60–70 కి చేరుకుంది. ప్రతివ్యక్తి ఎంత మంచి వాడైనా కాలానుగుణంగా కాలధర్మ పరిణామాన్ని అనుభవించక తప్పదు. వీటి నుండి విముక్తుడయ్యేందుకు మనిషి సమాజానికి దూరంగా వెళ్లి కొండల్లో, గుహల్లో నిర్జన ప్రదేశాల్లో నివసించాల్సి ఉంటుంది. అలాచాలా కాలంగా జీవించిన సిద్ధ పురుషులనేకులు ఇప్పటికీ ఈ లోకంలో వున్నారు.

అజ్ఞానం, అత్యాచారం, దురాచారాలు పెచ్చు పెరిగి జనజీవనం అధోగతికి చేరాక ధర్మాన్ని రక్షించేందుకు జ్ఞాని, సమర్థుడైన వ్యక్తి జన్మిస్తాడు. అలాంటి వారే జ్ఞానులు,అవతార పురుషులు.

సృష్టి అత్యంతాశ్చర్యకరం. దీనికి ఒక అంతే లేదు. అంతరిక్షంలో అన్ని లోకాలూ ఉన్నాయి. ఒక సూర్యగోళం గ్రహాలను, ఉపగ్రహాలను ధరించింది. అలాంటి కోటి సౌరవ్యూహాల్ని 12 ధృవ, ఆదిత్య మండలాలు ధరించాయి. వీటిని ఒకే ఒక్క సూర్యచైతన్యం ధారణ చేసింది. అదే అందరికి మూలమైన చైతన్యం, శక్తి ప్రదాత ! ప్రకాశప్రదాత కూడా రవియే! సర్వశక్తుడైన చైతన్యం. మన అవసరాలను అన్నిటిని కాంతి పుంజాల ద్వారా అందించే ఆదిధర్మ స్వరూపుడు. ధర్మరక్షకుడు ! అందరి ధారణా శక్తిని సంరక్షించే వ్యక్త చైతన్యం సూర్యుడే అని జ్ఞానులు చెప్పారు. గీతలో 'మూఢులు నేను మొదట అవ్యక్తుడనై తదుపరి వ్యక్తుడయ్యానని గ్రహిస్తారు. అయితే నేను ఎల్లప్పుడూ వ్యక్తుడనే' అని చెప్పడమైనది.

# 6. ధర్మం : విభిన్న కాలాల్లో జరిగిన మార్పులు

ఒకరోజు అనుభవంలో వేకువజామున నిద్ర నుండి మేల్కొన్న వేళలో ఉండే ప్రశాంతత, మనస్సుకు చాంచల్యరహితమైన ఏకాగ్రతను ప్రసాదిస్తుంది. సూర్యోదయానంతరం కాయకష్టం చేశాక టిఫిన్ చేసిన తర్వాత ఉత్సాహాన్ని పొందుతాం. మధ్యాహ్నం (12 గంటల తర్వాత) ఆహారం, కొంచెం విశ్రాంతి అవసరమనిపిస్తాయి. ఆ విశ్రాంతి సమయంలో కొంచెం చదవడం, రాయడం చేయవచ్చు. తర్వాత 3 నుండి 6 దాకాలేదా 4 నుండి 6 దాకా కొంచెం శారీరక శ్రమ కల్గించే పని చేసేందుకు, వాహ్యాళికి బాగుంటుంది. సూర్యాస్తమయం తర్వాత ధ్యానం శ్రమను

పరిహరిస్తుంది. రాత్రి 8–9 గంటల మధ్య భోజనం, తర్వాత 10 గంటల పిమ్మట ధ్యానం – నిద్ర. ఈ కార్యక్రమానికి ప్రొద్దున వాతావరణం చక్కగా ఉంటుంది.

దేహంలో, జపంలో పూరకగతి (ప్రాణగతి) క్రింద వ్యాపించిన వాయువును పైకి ప్రాణశక్తి వైపుకు పంపించి మనస్సు ఊర్ధ్వముఖం అయ్యేందుకు సహకరిస్తుంది. రేచకగతి వాయువు యొక్క గతాగతికి సంబంధించిన మార్గంలోని కఫాదిదోషాలను ఆహారకోశానికి త్రోసి జీర్ణ మయ్యేందుకు సహకరిస్తుంది. వాయువును మొదట ఈ గతిలో నెమ్మదిగా కదిలిస్తూ కొంచెం తీవ్రగతాగతిలోకి దింపి, వీలైనంత వేగంగా చేసి ఆ ప్రయత్నాన్ని విరమించాలి. మనోలక్ష్యం, దృష్టి గురుస్థానంలో భ్రూమధ్యం లో ఉండాలి. అందుకే దీన్ని 'కుంభకం' అంటారు. ప్రాణవిద్యా సాధన, ప్రాణజపం లేదా ప్రాణాయామం అంటే ఇదే ! ఇలా చేసే వేళ మనస్సులో బయటి లక్ష్యాలు కరగిపోయి, బయటి గాలి కూడ లోనికి ప్రవేశిస్తుంది. బయటికి వెళ్ళడం బాగా తగ్గి చివరకు పూర్తిగా స్తంభిస్తుంది. దీన్నే పతంజలి కూడ "శ్వాసప్రశ్వాసయోర్గతి విచ్ఛేదః ఇతిప్రాణాయామః" (గాలిని లోపలికి లాగుకుని బయటికి వదిలే క్రియను నిలపాలి) అని నిర్వచించాడు. రేచక, పూరక,కుంభకాలతో కూడిన ప్రాణాయామక్రమాన్ని బోధించాడు. యోగవాశిష్ఠ గ్రంథంలో కూడా ఇదే అంశం వివరించ బడింది. అయితే హఠయోగ ప్రదీపికలో ఇలా చెప్పబడలేదు. ముక్కుతో చేసేది శ్వాసాయామం. అది ప్రాణాయామం కాదు. యోగస్థితి (సమత్వం) లభించేందుకు సాధనమైన యోగవిద్య (ప్రాణజపం) కాదు.

వేగంగా సాగే వాయువు యొక్క గతాగతిలో (వాయుమథనం) పెరుగు చిలికిన వేళలో వెన్న తేలినట్లే విద్యుత్తు యొక్క శుద్ధమైన సారం

వెలువడి, పైకెక్కి, ప్రాణశక్తిలో చేరి, దాని శక్తిని ద్విగుణీకృతం చేస్తుంది. దీన్నే "ప్రత్యాహారం" అంటాం. అపుడు ప్రాణశక్తి సప్తపథం నుండి పైకెక్కి మెదడు కేంద్రంలోని ఒక గుహ్య (సూక్ష్మ) స్థానంలో ఉండే 'జీవ చైతన్యం'తో ఏకమౌతుంది. అపుడు మనస్సుకు ఏకాగ్రత కల్గి ధ్యానానికి సహాయక మౌతుంది. క్రమంగా ఈ స్థితి అభ్యాసబలం కొద్దీ ఎక్కువ సమయం దాకా ఉంటుంది. దీన్నే 'ధారణ' అంటారు. ఆ సమయంలో సృష్టి రహస్యాలన్నీ మనకు తమ రహస్యాల్ని వెల్లడిస్తాయి. ఇలా ఈ తపస్సులో విజ్ఞాన వికాసం కల్గుతుంది. అనంతరం ఈ సృష్టికి ఒక కర్త ఉండనే ఉంటాడు అనే నిర్ణయం దృఢపడి, దైవధ్యానం సాగి, పరమాత్ముని కృపతో – అతనితో మధురమైన సంబంధం ఏర్పడుతుంది. అదే యోగం. దాని ఫలితంగా స్థితప్రజ్ఞత్వం కల్గుతుంది. అన్నిటినీ గ్రహించి లోకకల్యాణం కోసం పనిచేస్తాడు. చేయించడంలో నాయకత్వం కూడ వహిస్తాడు. అలాంటి వ్యక్తినే యోగి అంటాం. అలాంటి వ్యక్తి దేవుడంటే ఎలాంటి వాడనే విషయాన్ని బాగా తెలుసుకోగల్గుతాడు. "యోగినస్తం ప్రపశ్యంతి భగవంతం సనాతనం" (సనత్సు జాతీయం – మహాభారతం) అలాగే బైబిల్‌లోని క్రొత్త నిబంధనలో ఏసుక్రీస్తు "నన్ను తెలుసుకున్న వాళ్ళు నా తండ్రిని తెలుసుకున్న వారౌతారు" అని చెప్పాడు. ఎందుకంటే యోగి మరియు తండ్రి అయిన దేవుడికి భేదం లేదు. అందువల్ల యోగిని గ్రహిస్తే తండ్రిని అర్థం చేసుకున్నట్లే.

ఇలా ఒకరోజులో ప్రాతఃకాలం, మధ్యాహ్నకాలం, సాయంకాలం, రాత్రి (నిద్రా సమయం) – ఇవి ఉన్నట్లే జపంలో ఋక్, యజుర్, సామ గతులు (రేచక, పూరక, కుంభకాలు)తర్వాత ధ్యాన స్థితులున్నాయి. ఆ ధ్యాన సమాధి స్థితినే "యోగనిద్ర" అంటారు. స్వప్నస్థితి యోగనిద్ర కాదు.

దినంలో ప్రాతఃకాలం, మధ్యాహ్నకాలం, సాయంకాలం, రాత్రి – ఉన్నట్లే ఒక సంవత్సరంలో చలికాలం, వేసవికాలం, వానాకాలం ఉన్నాయి. వీటినే ఋతుచక్రం అంటారు. అలాగే ఒక వ్యక్తి యొక్క జీవితంలో బాల్యం, యౌవనం, కౌమారం, వార్ధక్యం అనే స్థితులు ఉన్నాయి. దాని ప్రకారంగా జ్ఞానులు బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం, సన్యాసం అనే ఆశ్రమాల్ని విభజించారు. అలాగే సమాజ జీవనం సాఫీగా సాగేందుకు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల వ్యవస్థ ఉంది. వర్ణాశ్రమ ఉచిత నియమాలను ఉల్లంఘించి, విరోధించి నడుచుకునే వాళ్ళనే "పంచము"లంటాం. వీళ్ళే ఊరిబయట ఉండే అస్పృశ్యులు.

అలాగే కల్పావధిలో బ్రహ్మ ఒక దేశపు ప్రధాని వంటి వ్యక్తి. విష్ణువు రాజ్యపాల్ (గవర్నర్). రుద్రుడు సేనాధిపతి. ఈ ప్రపంచపు వేర్వేరు దిక్కుల్లో కార్యం నిర్వహించే అష్ట వసువులున్నారు. వారే దేవతలు. వారిలో ఇంద్రుడు గవర్నర్ లాంటి వ్యక్తి. బృహస్పతి ప్రధానమంత్రి. యముడు దండాధికారి. ఈ అష్టవసువుల సహాయం కోసం 25 మంది అనుదేవతా వర్గాలున్నాయి.

బ్రహ్మపదవికి వచ్చిన ప్రతి వ్యక్తి తన కాలావధిలో జరగాల్సిన కార్యక్రమాన్ని విభజిస్తాడు. (బ్రహ్మకల్పం) ఒక్కో విభాగాన్ని కృతం, త్రేతా, ద్వాపరం, కలి – అని నాల్గుగా విభజించాడు. కృతయుగంలో తపస్సుకే ప్రాధాన్యం. జ్ఞానానికి ప్రాముఖ్యం. త్రేతాయుగంలో యజ్ఞ ప్రాధాన్యం. ద్వాపరంలో ముక్తి, భక్తి ప్రాధాన్యం. కలియుగంలో నిద్రలాంటి అజ్ఞానానికే ప్రాధాన్యం ఉంది. ఇది సహజమే కదా? కాదా?

దానికి అనుగుణంగా యుగధర్మాలు ఇలా ఉండాలని గ్రహించి జ్ఞానులు రాసిపెట్టారు. అవి శాస్త్రాలు కావు, సహజమైన వివరాలు.

యోగి నిరంతరం అప్రమత్తుడై ఉన్నట్లు బ్రహ్మస్థానంలోని వ్యక్తి యోగి అయితే ఆ వ్యక్తి అధికారావధిలో జగత్తులో ఒకే రకంగా ఉండడం సాధ్యమా? అవుతుంది. దీన్ని తెలుసుకున్న విశేషజ్ఞానుల ప్రయత్నమే మున్ముందు వచ్చే సత్యయుగం.

బ్రహ్మకాల ప్రమాణం గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. నాల్గు యుగాలు చేరి 33 లక్షల సంవత్సరాలనీ (సంధికాలాలను కలుపుకుని దాదాపు 43 లక్షలు) ఒట్టి 36,000 సంవత్సరాలనీ, 5000 సంవత్సరాలనీ చాలామంది విభిన్నమైన అభిప్రాయాల్ని వివరించారు. "చతుర్యుగ సహస్రాణి బ్రహ్మణః దినముచ్యతే" (నాల్గు యుగాలు చేరితే బ్రహ్మకు ఒక పగలు, అంతే సమయం రాత్రి) అని చెప్పబడింది. వీటి మొత్తం 365 అయితే అతనికో సంవత్సరం. అలాంటి నూరు సంవత్సరాలు బ్రహ్మకాలావధి. ఆయుఃప్రమాణం.ఇది వారి వ్యాఖ్యానం. అయితే ఇది బ్రహ్మ విషయం; బ్రహ్మ (ప్రజాపతికి)కు సంబంధించినది కాదు. వేద మంత్రాల్లోని బ్రహ్మ (ప్రజాపతి) అంటే పురుషబ్రహ్మ. (పురుషోత్తముడుగా గీతలో వర్ణింపబడిన మూలచైతన్యం, దేవదేవుడు అనే అంశాన్ని వారు గమనించలేదు).

విష్ణు పురాణం ప్రకారం నాల్గుయుగాలు చేరితే బ్రహ్మకల్పం – బ్రహ్మకు ఒక దినం. మనం జగత్తు గమనాన్ని పరిశీలించడం ద్వారా మనం ఈ అంశాన్ని అర్థం చేసుకోవాలి. మనకు ఒక సంవత్సరమైతే సూర్యలోకవాసులకు (వసువులకు) ఒకరోజు. వారి సంవత్సరం అంటే మన 365 సంవత్సరాలు. వారి ఆయుః ప్రమాణం అంటే – మన

36,500 సంవత్సరాలు. కల్పానికి – కల్పానికి నడుమ ఉండే సంధికాలం 500 సంవత్సరాలు. 36000 సంవత్సరాల్లో నాల్గు యుగాలు. ఒక్కొక్కటి 36000/4 = 9000 సంవత్సరాలని చెప్పి శ్రీ బి.హెచ్. శ్రీధర్ గారి లెక్కలు సరైనవని అనిపించడం లేదూ ! ఈ కల్పమనేది బ్రహ్మకు ఒక దినమే కానివ్వండి ! ఆయుఃప్రమాణమే కానీ ! బ్రహ్మదినాల్లో 14మంది మనువులు వస్తారు. ప్రతి మనువు కాలంలో త్రిమూర్తులు, దిక్పాలకులు, సప్తర్షుల స్థానానికి నియామకాలు జరుగుతాయని విష్ణుపురాణంలో చెప్పడం జరిగింది. అందుకే బ్రహ్మకల్పాన్ని బ్రహ్మ యొక్క దినంగానే మనం పరిగణించాల్సి ఉంటుంది.

అందువల్ల బ్రహ్మకల్పాలు 365. అంటే 36500 × 36500 సంవత్సరాలు బ్రహ్మ ఆయువు. ఇందులో 14 మనువులంటే మన కాల మానం ప్రకారం అనేక లక్షల సంవత్సరాలౌతాయి. ఇపుడు వైవస్వత మన్వంతరం ముగిసింది. సూర్యసావర్ణి మన్వంతరం ప్రారంభం కానున్నది. బ్రహ్మ యొక్క 50 సంవత్సరాలు గడిచి 51వ సంవత్సరంలో 28 చతుర్యుగాలు ముగిశాయి. దీన్ని గ్రహించకుండా వాదించడం సరైన విషయం కాదు. ఇంతవరకూ నడిచింది 'శ్వేతవరాహకల్పం' (అంటే ఏమిటనే అంశాన్ని ఎవరు వివరించారు?). 'సిద్ధానాం కపిలో మునిః' అని గీత. ఆ కపిల మహర్షి మరోపేరే శ్వేతవరాహుడు. అతడు బ్రహ్మ స్థానంలో ఉంటూ నివృత్తుడయ్యే సమయం. సూర్యసావర్ణి (హిరణ్య గర్భ ఋషి) మనువుగా ప్రపంచ కర్తవ్యాన్ని స్వీకరించే కాలం. వైవస్వతకాలం (శ్రాద్ధదేవుని) ముగిసింది.

# 7. ధర్మపు అవనతి

'అహింసా పరమో ధర్మః' అనే వాక్యం మహాపురుషుడైన బుద్ధుడి బోధ. అలాగే జైన తీర్థంకరులు, క్రైస్తవ సన్యాసులు కూడా దీన్నే బోధించారు. భారతదేశపు పురాణాల్ని చదివితే బ్రహ్మకల్పం యొక్క ప్రతి ప్రారంభంలో అహింస ఆచరణలో ఉంటుంది. అందుకే ప్రాచీనులు ఆదితీర్థంకరుడైన ఋషభుణ్ణి, సిద్ధార్థుడగు బుద్ధుణ్ణి అవతారపురుషులుగా పరిగణించారు.

బుద్ధుడి నిర్యాణం తర్వాత భారతదేశంలో అతని అనుయాయులే లేకుండా పోయారు. వేరే దేశాల్లోని వాళ్ళు పేరుకు మాత్రమే బౌద్ధులు. తద్విరుద్ధంగా కార్యాలు చేస్తున్నారు. బుద్ధుని తర్వాత 500 సంవత్సరాల దాకా మాత్రమే అతని బోధనలు ఆచరించబడ్డాయి. తర్వాత ఏసుక్రీస్తు ద్వారా ఈ ధర్మం ఆచరించబడింది. కొంతకాలం దాకా కొనసాగినట్లు చరిత్ర ద్వారా మనకు తెలుస్తుంది.

తర్వాత అరబ్‌దేశాల్లో విప్లవం, మహమ్మద్ పైగంబర్ ఇస్లాం (శాంతి) బోధనలు జరిగినా ఈ మతం హింసాత్మకమన్నట్లుగా ఉన్నదని చెప్పక తప్పదు. అదే సమయంలో కొంచెం అటూ ఇటూ క్రైస్తవులలో విభిన్నవర్గాల వారి మధ్య యుద్ధాలు జరిగి "అహింస' అనేది పేరుకు మాత్రమే మిగిలింది. పర్షియాలోని జరాతుష్టుని చంపడం అందరికీ తెలిసిందే.

బుద్ధుడి తర్వాత అశోకుని రాజ్యభారంలో అహింసాచరణ ప్రయత్నం విఫలమై అశోక చక్రవర్తి అంతఃపురంలో ఎక్కడ చనిపోయాడో ఆ వివరాల్ని ఏ చరిత్రకారుడూ రాయలేదు. తర్వాత ఉత్తర భారతంలో,దక్షిణ భారతంలో వివిధ రాజుల పాలనలో ఎన్నో యుద్ధాలు జరగటం, దక్షిణపు

రాజుల అంతఃకలహాల కారణంగా పరదేశీయుల దాడి, పరదేశీయుల ఆధిపత్యానికి దారితీయడం ఇవన్నీ చరిత్రలో ప్రసిద్ధమైన అంశాలే !

ముస్లిం పాలకుల మతపరివర్తనల వల్ల కల్గిన హింసాచారం, బ్రిటిష్ వారి దర్పం, ప్రలోభనాత్మక మత పరివర్తనల కార్యాలు భారతీయులు అప్రమత్తులై ఐకమత్యంతో స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసేందుకు కారణాలైనాయి. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటుకు రాణాప్రతాప్, శివాజీ, విజయనగర రాజులు సారథ్యం వహించడం చరిత్రలో ప్రసిద్ధమైన కథ. కాంగ్రెస్ స్థాపన జరగడం, శాంతియుత సంగ్రామం, గాంధీజీ సత్యాగ్రహాల పరిణామంగా దేశానికి అసంపూర్ణమైన, విఫలమైన స్వాతంత్ర్యం లభించిందే కాని, ప్రజల శాంతి, సౌఖ్యాలు కేవలం కలలుగానే మిగిలి పోయాయి. దీనికి బ్రిటిష్ పాలకుల కుట్ర, కుతంత్రాలే కారణాలు. దాన్ని తనస్వార్థం కోసం వాడుకున్న జిన్నా నాయకత్వంలో సాగిన మహమ్మదీయ ప్రజల సంకుచిత మనస్తత్వపు మూర్ఖతతో కూడుకున్న హఠం విభజన. మన నేతలైన గాంధీజీ, రాజాజీ, నెహ్రూల ఆతురత దేశాన్ని రెండుగా చీల్చింది. విరోధం, యుద్ధం, అశాంతికి కారణమైందని చెప్పక తప్పదు.

అలాగే పరిపాలనా సౌలభ్యం కోసం విరుద్ధంగా భాషాప్రయుక్త రాష్ట్రాల కల్పన దేశంలో అనైక్యతకు కారణమైంది. ఇది పంజాబ్‌లో సిక్కుల క్రాంతికి, తమిళుల విప్లవానికి దారి తీసింది. ఇలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న ఇప్పటి ప్రపంచంలోని ముఖ్య రాజకీయ పక్షాల సామ్రాజ్యవాద రాష్ట్రాలు, మరియు సమతావాద రాష్ట్రాలు పరస్పరం పోరాటాన్ని ప్రారంభించేందుకు హిందువుల్ని, ముస్లిమ్ మతస్థుల్ని కీలుబొమ్మలుగా ఉపయోగించుకునేందుకు ఒక అవకాశం కల్గింది.

అణువిజ్ఞాన ప్రగతి, జనజీవన సుఖాలకు బదులుగా వినాశ భయాన్ని మనకు అందించింది. జాతి జాతికి, దేశానికి, దేశానికి నడుమ స్వార్థ సాధనకై అంతఃకలహాలు. అందువల్ల 'అహింసా పరమో ధర్మః' అనే మాట ఆచరణ సాధ్యం కాలేదు. ఒక స్వప్నంలా, కల్పనలా మిగిలింది. దీని పరిణామం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే !

# 8. ఆది ధర్మాగమన లక్ష్యం

ఆదిధర్మం అంటే జగత్తు పుట్టుటకు కారణమైనది. ఆ జగత్తును ధరించే మూలచైతన్యమే (ఆత్మ).

ధర్మగ్లాని జరిగిన వేళలో, అధర్మవృద్ధి జరిగిన కాలంలో సాధువులను రక్షించి, దుష్టులను దండించే కార్యం సంధికాలాల్లోనే జరుగుతుందని గీతలో చెప్పబడింది. అలాగే జరుగుతూ వస్తుంది. ఎలా?

**'యదాయదా హిధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం'**

అన్న గీతావాక్యం ప్రకారం జ్ఞానశక్తులు మూర్తీభవించిన ఆత్మను, పుత్రుణ్ణి పరమాత్మ సృష్టిస్తాడు. పరమాత్ముని అవతారాలు సంభవిస్తాయి.

అవతారమంటే ఒక విశిష్టగుణ శక్తులతో కూడిన వ్యక్తిలో, లేదా ప్రాణిలో అలాంటి విభూతులు చేరడం. అవతార పురుషులు పరమాత్ముని ప్రతినిధులై దుష్ట శిక్షణ, శిష్టరక్షణ కార్యాన్ని నిర్వహించే పవిత్రాత్ములు. వారికి క్రిందటి జన్మ లేదు. ఉదాహరణకు భగవద్గీతలో "విభూతి యోగం' అనే అధ్యాయంలో 'వృష్ణీనా మహం కృష్ణః పాండవానాం ధనంజయః' అన్నారు. అంటే అర్జునుడు విభూతి మాత్రమే. అవతారి కాదు. అవతార

పురుషునికి ముఖ్య సహాయకుడు ! రామావతారంలో ఆంజనేయుడున్నట్లు! 'ఉపావతార'మని చెప్పవచ్చుంతే !

ఓసారి ప్రభువులను అడిగాను "విజయీంద్రులు మిమ్మల్ని దేవుడంటారు. భాగవతంలో చెప్పబడినట్లు కల్కి బ్రాహ్మణుడుగా రావాలి కదా? మీరెందుకు క్షత్రియులుగా వచ్చారు?" అని. దీనికి ప్రభువులు "నేను కల్కిని కాను. అతని మార్గాన్ని సుగమం చేసేందుకు వచ్చాను. ఉపావతారాన్ని" అని జవాబు అందించారు.

"ఆది నుండి ఇప్పటిదాకా లెక్కలేనన్ని అవతారపురుషులు జన్మించారు. జన్మిస్తూనే ఉంటారు" అని చెప్పేవాళ్ళూ ఉన్నారు. అలాంటి అవతారాల్లో 21 అవతారాలు ముఖ్యమని వ్యాసులు రాశారు. అందులో విరాట్ పురుషుణ్ణే తొలి అవతారం అని చెప్పడం జరిగింది. బ్రహ్మ, నారదుడు, ధృవుడు, ధృవవరదుడు, వ్యాసావతారుడు మొదలైన అవతారాల్ని ఉల్లేఖించాడు. నారదుడు బ్రహ్మకొడుకు ! బ్రహ్మ నారాయణుని పుత్రుడని వారే రాశారు. దశావతారాల తర్వాత వ్యాసుడు తన్ను పదకొండవ అవతారంగా చెప్పుకొన్నాడని చెప్పక తప్పదు.

మూల భాగవతం మహావిష్ణువు ద్వారా బ్రహ్మకు, బ్రహ్మ ద్వారా నారదునికి, నారదుని ద్వారా వ్యాసమునికి బోధించబడిందట. దీని ప్రకారం అవతారాలు పదే !

మత్స్యం, కూర్మం, వరాహం, నారసింహుడు, వామనుడు, పరశు రాముడు, దశరథ రాముడు, బలరామ, కృష్ణుడు, బుద్ధుడు, కల్కి అంటే 11 అవుతాయి. బుద్ధుడితో పది అవతారాలవుతాయి ఇక కల్కి విషయం ఏమిటి? పది అవతారాల తర్వాత సంభవించవచ్చనే పదవ అవతారమా? కొందరు బలరాముణ్ణి విడిచిపెడతారు. కొందరు కృష్ణున్ని పరిగణించరు. ఇవి రెండూ తప్పే ! మరి కల్కి అవతారమే కాదని ఎలా నిర్ణయించడం?

భాగవతంలో 12వ స్కంధంలో కలియుగంలో 5000 సంవత్సరాల తర్వాత వర్ణ సాంకర్యం జరుగుతుంది. చేతిలో ఖడ్గం ధరించి, దివ్యాశ్వా రూఢుడై కల్కి వచ్చి ధర్మసంస్థాపన చేస్తాడని రాయబడింది. కల్కి దేహం నుండి వెలువడే కిరణాలలో కలి నాశమై సత్యయుగ స్థాపన జరుగు తుందని రాయబడింది.

యుగాలు నాల్గు. అవి కృతయుగం, త్రేతాయుగం, ద్వాపర యుగం, కలియుగం. ఈ సత్యయుగం అంటే ఏమిటి? కొందరు కృత యుగాన్నే సత్యయుగం అంటారు. అది తప్పు. సత్యమంటే శాశ్వతమైన యుగం. అపుడు స్థాపించబడిన ధర్మ వ్యవస్థ చిరకాలం అలాగే మిగిలి పోతుంది. అంటే మళ్ళీ అవతారాల అవసరం ఉండదు. ధర్మగ్లాని జరగదని భావం.

'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' ఒక్క శాశ్వత చైతన్యాన్నే విశేష ప్రజ్ఞావంతులు బహువిధాలుగా వర్ణిస్తారు అనే మహర్షుల వచనం ప్రకారం ఆ ఏకైక చైతన్యం (సత్యం) ప్రకటమయ్యే సంధికాలం. అదే ఈ కలికి ముగింపు. తర్వాత కలి అనేదే ఉండదు. భూమి స్వర్గంలా వికుంఠత లేనిదై వైకుంఠంలా, అజ్ఞానరహితమైన కైలాసంగా మారుతుంది. మర్త్య లోకమని అనిపించుకున్న ఈ లోకం అమృత ఖండమౌతుంది. ఇలా వ్యాఖ్యానించిన వాళ్ళూ ఉన్నారు.

తెలుగులో వీరబ్రహ్మం గారి 'గోవింద వచనములు' ఒక కాల జ్ఞానం' ! గీత గురించి కొందరు పలికినట్లుగా 'భగవతా నారాయణేన స్వయం' అన్నట్లుగా ఈ వచనాలున్నాయి. 'గురు', ఆదినారాయణుడు' అనే శబ్దాలు ఈ కాలజ్ఞానంలో హిరణ్యగర్భఋషికే అన్వయిస్తాయి. ఆదికేశవుడు, వీరవసంతుడు అనే శబ్దాలు 'కల్కి'కి అన్వయిస్తాయి.

'గురువు'ను శివుడుగా చెప్పడమైనది. కల్కిని అవతార పురుషుడుగా పరిగణించడమైనది. తాను రాసిన కాలజ్ఞానానికి ఆధారం 'పద్మపురాణం' లో ఉందని వీరబ్రహ్మం గారు చెప్పారు.

ప్రపంచంలో ఇంకెందరో కాలజ్ఞానం చెప్పారు. బైబిల్‌లో Revelation అనే చోట సెయింట్ జాన్‌కు కల్గిన దర్శనాలు, వినిపించిన వాక్కుల వివరాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి.

"ఒక తెల్లటి గుర్రం, ఒక ఎర్రటి గుర్రం, ఒక బూడిదరంగు గుర్రం – వీటి గురించిన ప్రస్తావన వుంది. ముగ్గురు మహాపురుషుల వివరాలున్నాయి. వారిలో ఒకరు ఏసుక్రీస్తు. మరొక వ్యక్తి ఏసుక్రీస్తునే పోలి ఉంటాడు. తలపై మేక ఉన్నిలా ఉండే తెల్ల వెంట్రుకలుంటాయి. మరొక వ్యక్తి సింహాసనం పై కూర్చుని ఉంటాడు. అతడి వచనం ఇది అని జాన్ ఇలా రాశాడు. "సింహాసనం పై కూర్చున్న వ్యక్తి చెప్పాడు. He is Son to me but I am God to him" అతడు నాకు కొడుకు. అయితే నేనతనికి దేవుణ్ణి !" అని అర్థం.

తర్వాత జాన్‌కు విన్పించిన వాణి "Father and Son will rule the world for thousands and thousands of years" (అంటే దేవుడు మరియు అతని కొడుకు జగత్తును చాలాకాలం దాకా పరిపాలిస్తారు). ముమ్ముందు సముద్రమే ఉండదు. మాంసాహారమే ఉండదు – ఇలాంటి అనేక విషయాలు చెప్పబడ్డాయి. ఖురాన్‌లో Dooms Day (న్యాయ విచారణ లేదా విశ్వాంతం) గురించి రాస్తూ 14వ శతాబ్దపు ఏసు వచ్చి ప్రపంచాన్ని 40 సంవత్సరాలు పరిపాలిస్తాడనీ, తర్వాత ఏం జరుగుతుందో చెప్పడం సాధ్యం కాదని చెప్పబడింది.

ఫ్రాన్స్ దేశానికి చెందిన యహూదీ సన్యాసి నోస్ట్రడామస్ తన "Centuries" (శతాబ్దాలు) అనే గ్రంథంలో చెప్పిన భవిష్యం ఆశ్చర్యకరంగా వుంది. “ఎంతో కాలం నుండి మనం నిరీక్షిస్తున్న మహాపురుషులు అవతరించేది యూరప్‌లో కాదు. సముద్రంతో ఆవరింపబడిన మహాద్వీప కల్పంలో. ఆ దేశానికి ఆ సముద్రం వేరే వుంది. ఆ దేశపు ఉత్తరంలో కాకుండా దక్షిణభాగంలో అతడు అవతరిస్తాడు. అతడు భారతదేశపు అధికారాన్ని హస్తగతం చేసుకుని క్రీ.శ. 1999లో దిగ్విజయ యాత్రను ప్రారంభిస్తాడు. ఆ రోజు గురువారం అయి ఉంటుంది. అతడు ఆల్ఫ్స్ పర్వతాన్ని దాటి ఫ్రాన్స్‌ను జయిస్తాడు. బ్రిటన్ శరణు వేడుతుంది. అమెరికా మిత్రుడు తెల్లగొడుగు క్రింద ఒకే రాజ్య మౌతుంది. విశ్వమానవ సౌభ్రాతృత్వం సాధ్యమౌతుంది. ముస్లిము బాంధవులే ఉండరు. జగత్తంతా ఒకే ధర్మాన్ని అనుసరిస్తారు. అది క్రైస్తవ ధర్మం మాత్రం కాదు.

భారతదేశంలో 20వ శతాబ్దపు మహాయోగి అనిపించుకున్న శ్రీ అరవిందులకు యోగవిద్య అంటే ఏమిటో నిజంగా తెలియదని చెప్పక తప్పదు. ఆ సత్యం వారు రాసిన "Essays on Gita" అనే పుస్తకంలో 6వ అధ్యాయం ద్వారా తెలుస్తోంది.

"Here it seems Lord Krishna explains a system which may be something like that of Raja Yoga"అని చెప్పడాన్ని గమనిస్తే – శ్రీకృష్ణుని ముఖంలోంచి వెలువడిన భగవద్గీతలోని యోగవిద్య గురించిన స్పష్టమైన జ్ఞానం అరవిందులకు లేదని పాఠకులు గమనించాలి. లేలే మహారాజుల నుంచి వారు నేర్చుకున్న ప్రాణాయామం హఠయోగ ప్రకారాల్లో ఒకటని అన్పిస్తుంది.

తాంత్రికుల కుండలినీ యోగమంటే – అందులోనూ హఠయోగమే కన్పిస్తుంది. ఎందుకంటే ఉడ్యాణం లాంటి ఆసనాల ఆవశ్యకత అక్కడ

వివరించబడింది. వాళ్ళు చెప్పినట్లుగా గుదద్వారం, జననేంద్రియాల మధ్యలో ఎలాంటి శక్తి కూడా సుప్తస్థితిలో లేదు. అక్కడ 'అపాన' వాయువు వ్యాపించి ఉంటుంది. ఇది మలమూత్ర విసర్జన క్రియలో దేహం నుండి బయటకు వస్తుందే కాని పైకి లేవదు.

నిజమైన యోగవిద్య, లేదా ప్రాణాయామం (వాయుమథనం) తర్వాత వాయువు లోంచి బయటికి వచ్చిన విద్యుత్‌శక్తి క్రింది దాకా వెళ్లి, మళ్ళీ పైకి ఎక్కి, మూత్రపిండాల ద్వారా వెన్నెముకలో చేరి ఎడం వైపు నుండి పైకి లేస్తూ, కుడి వైపు నుండి క్రిందికి దిగుతూ వృత్తాకారంగా తిరుగుతూంటుంది. ఇదే కుండలినీ శక్తి. ఇది సప్తపథంలో ఉండే శక్తి స్థానం వద్దకు వెళ్ళి, త్రోయబడి, క్రిందికి దిగి ఇడా, పింగళ నాడుల మధ్యలో ఉండి సుషుమ్నా ద్వారా క్రిందికి దిగుతూ పైకి పోతూ ఉంటుంది. దీని శుద్ధసారమే అశనం. దాన్ని తనలో చేర్చుకున్న ప్రాణశక్తి పరిపుష్టమై పైకిఎక్కి ఆత్మతో చేరుతుంది. విద్యుత్ శక్తి (కుండలినీ శక్తి వాయువు) ఆత్మలో చేరదు. దీన్నే 'శక్తి చాలిత ప్రాణాయామ'మనీ, 'కేవలకుంభక'మనీ కొందరన్నారు. కొన్నిసార్లు శరీరంలోని గాలి విద్యుత్‌గా మారి, ఆ విద్యుత్తంతా ప్రాణశక్తితో చేరడమూ జరుగుతుంది.

యోగి దేహత్యాగం చేసే వేళలో 'జడసమాధి' స్థితిలోనూ ఇలా జరుగుతుంది. అపుడు వాయు విద్యుత్తుల సంచారమే లేకపోవడం వల్ల నాడీ స్పందన, గుండె కొట్టుకోవడం ఏదీ ఉండదు. యోగి శరీరంతో అంతరిక్ష గమనం చేసే వేళలో గాలి లేనట్లు అనిపించి, విద్యుత్ సంచారం మాత్రం ఉంటుంది. హృదయనాడుల స్పందనం వేగానికి అనుగుణంగా, వేగంగా జరుగుతుంది.

అయితే అరవిందుల వారిలో దేవుని ఉనికి పట్ల ఒక అచంచలమైన నమ్మకం, శరణాగతి ఉందని అంగీకరించాల్సిందే ! త్రిమూర్తుల్లో ఒక్కడైన

బ్రహ్మ (కపిలుడు) యొక్క అధికార కాలం పరిసమాప్తమై మానవుడై పుట్టాక, అతని ఆసనమైన కమలంలో ప్రాణశక్తి బయటికి వచ్చి దాంతో పాటు మూల చైతన్యం నుండి అపుడే పుట్టి ఒక ఆత్మ చేరి అరవిందులై నారు. ఇది జరిగింది అరవిందులు జైల్లో ఉండి శ్రీకృష్ణ దర్శనం చేసిన వేళలో ! దానికన్న ముందు ఆ దేహంలో ఉన్నది సావిత్రి పతియైన సత్యవాన్ అనే అతని జీవం. అరవిందుల సాహిత్యాన్ని ప్రభు అచ్యుతులు ప్రశంసించారు. వారిని 'ఆధునిక కాలపు వ్యాసుల వారని చెప్పవచ్చు' అన్నారు.

మహర్షులు ఎక్కడైతే ఆగారో అక్కడ నుంచి అరవిందులు తపస్సు ప్రారంభించారు. ఉపనిషన్మహర్షుల తపోలక్ష్యం మోక్షమొక్కటే ! వీరిది గీతలో చెప్పబడిన మోక్ష సన్యాసమనే స్వార్థ త్యాగం. దీన్ని త్యాగంలోని అత్యున్నత శిఖరమని అనిపించింది. "Supra Mental Force" 'యన్మన సానమనుతే' మొదలుగా గల వాక్యాల్లో మహర్షులచే వర్ణింపబడిన బ్రహ్మం ఎన్నడూ క్రిందికి దిగి రాకుండ, దాని తేజఃపుజం మాత్రం వచ్చింది. అంశమంటే కిరణం. 'అంశుమాన్', 'సహస్రాంశు' అనే సూర్యమండల వర్ణన గురించి ఆలోచిస్తే ఈ అంశం సులభంగా అర్థమౌతుంది. అంశం అంటే కిరణమే కాని భాగం కాదు. జీవాత్మ పరమాత్మల సంబంధాన్ని అంగీకరిస్తే పూర్ణత్వానికి చ్యుతి కల్గుతుందని బింబప్రతిబింబ భావాన్ని కల్పించిన వారికి ఇదెందుకు అర్థం కాలేదు? అలాంటి వారిని 'సర్వజ్ఞు'లని, ఆదిశంకరులని నమ్మిన ఈనాటి ప్రజల బుద్ధి మాంద్యానికి కారణం నిజమైన తపస్సుకు అవసరమైన ప్రాణవిద్య లభించక పోవడం. కలి ప్రభావం మరో కారణమని చెప్పక తప్పదు.

ఆ Supra Mental force (మూల చైతన్యం) దిగి వచ్చేందుకే తమ తపస్సు అని వెల్లడించారు. అది అవతరించిందని అన్నారు. కాని

ఎక్కడ? ఏ రూపంలో అనేది తెలియడం లేదని వారన్నారు. వారి అనుయాయి, ఆశ్రమమాత అయిన మదర్ మేరీమీరా అనే ఫ్రెంచ్ మహిళ కూడా ఇదే అంశాన్ని తన పుస్తకంలో వెల్లడించింది.

అయితే ఆ జన్మ ముగిసినా వారు మళ్ళీ పుట్టి ఆ Descent పరిణామంగా జరిగే లోక కల్యాణకార్యాన్ని చూసి, దాంట్లో పాలు పంచుకొని, సేవించి, ధన్యులు కావచ్చు.

ప్రభుయోగి అచ్యుతులు ఓసారి "ఆది ధర్మాన్ని నేను తీసుకు రావడమే నిజమైతే నాకు కావలసిందంతా జరుగుతుంది" అని అన్నారు. యోగపూర్ణుడు, త్యాగపూర్ణుడూ అయిన ఆ మహాత్మునికి కావలసింది లోక కల్యాణం కాకుండా ఇంకేమిటి? ప్రభువుల మాటల్ని స్మరిస్తూంటే గ్రీక్ పురాణకథల్లో ఒక చిత్రం గుర్తుకు వస్తుంది. నా ప్రభువు గారి పోలికలుండే ఒక వ్యక్తి తన భుజం పై ఒక చిన్న అబ్బాయిని ఎత్తుకొని నిలుచున్నాడు. "కామదేవుడు, మరియు శుక్రదేవత" అని ఆ చిత్రం క్రింద వివరణ ఉంది. అంటే ఆది ధర్మాన్ని తానే తీసుకువస్తానని ప్రభువులు చెప్పిన జోస్యం ప్రాచీన గ్రీక్ పురాణకథల్లో ఉత్తరమై ఉండవచ్చు కదా!

ఒక బౌద్ధ లామా రాసిన "బౌద్ధమతం" (Buddhism) అనే గ్రంథంలో "We must see the eternal man" అనే వాక్యం ఉంది. ఈ పూర్ణ చైతన్యం మానవరూపంలో భూమిపై అవతరించి రావడాన్ని లేదా శిశురూపంలో వచ్చి, పెరిగి, నిత్య మానవుడుగా మారడాన్ని చూడాలి. అపుడే జగదుద్ధారం అనే ఆశయం ఆ లామాలో చూసి ఉండాల్సిందనిపిస్తుంది. బుద్ధుని తత్వానికి కారణం రోగం, మరణం – వీటిని జయించే ఉపాయాన్ని కనిపెట్టడం. అది అతనికి సాధ్యం కాలేదు. నిరాశతోనే తృప్తి పడాల్సి వచ్చింది. "ఆశైవ పరమం దుఃఖం, నిరాశా

పరమం సుఖం" (ఆశే దుఃఖానికి మూలం, నిరాశే పరమ సుఖం) అనే బోధనను ఆయన చేయాల్సి వచ్చింది. అసమర్థతయే తృప్తికి సాధనమా? అందుకే పాశ్చాత్య విజ్ఞులు మనల్ని "నిరాశావాదులు" అని అన్నారు. సిద్ధార్థుణ్ణి బుద్ధిమంతుడు అనవచ్చు. జ్ఞాని అని చెప్పడం సాధ్యం కాదు.

## 9. సంధికాలం

### (ఆది ధర్మమే మానవరూపం ధరించి భూమిపై అవతరించాలనే ఆశయం)

'నభూతో నభవిష్యతి' (గతంలో జరగలేదు. ఇకముందూ జరగదు) అనే సంధికాలమే ఇది. ప్రాచీనకాలంలో కొందరు రాక్షసుల పీడవల్ల ధర్మగ్లాని ఏర్పడిన వేళలో కొందరు జ్ఞానులు, దేవతలు భగవంతుని అవతరించమని ప్రార్థించి ఉండవచ్చు. స్వార్థపరులు, అధర్మాన్నే ధర్మంగా భావించిన అజ్ఞానులు, తాము సర్వజ్ఞులం, సర్వశక్తులమని భావించిన కుతంత్రులైన రాక్షసులతో నిండిన ఈ లోకంలో తమ ఉనికి, తమకు ఆశ్రయమందించిన ఈ భూమాత అస్తిత్వమే లేకుండా పోతుందనే మహా భయానికి గురైన అనేకులు దైన్యంతో పరమాత్ముని చూచి "దేవా ! నువ్వు లేవా ? సర్వశక్తుడా ! రక్షించు ! రక్షించు!" అనే మాటల్ని విన్నవించి ఉంటారు. అన్నిచోట్లా ఇదే విన్పిస్తోంది. అలాంటి కాలం సమీపిస్తోందని జ్ఞానులైన మహర్షులు తామున్నచోటే హర్షిస్తున్నారు.

వ్యాసభాగవతంలో నందవంశ నిర్మూలన తర్వాత 25 శతాబ్దాలు గడవాలి. తర్వాత 150 సంవత్సరాలకు శంబల గ్రామంలో విష్ణుయశుడనే బ్రాహ్మణునికి కల్కి అవతరిస్తాడని రాయబడింది. ఆ కాలమూ సమీపించింది. శంబల గ్రామం రాజపుత్ర స్థానంలో ఉందని కొందరు,

సామీర్ పీఠభూమిలో ఉందని అనిబిసెంట్ అన్నారు. గంగా యమునల మధ్యలో ఉందని మరొకరు, ఒకరు తామ్రపర్ణి నదీతీరంలో ఉందని అన్నారు. 'శంబల గ్రామం' అంటే శబ్దోత్పత్తి ప్రకారం నీటితో ఆవరించ బడిన ఒక ద్వీపం, గ్రామం అని అర్థం.

"రానున్న కాలంలో ప్రపంచ యుద్ధం జరుగుతుంది. దాని తర్వాతే భారత దేశానికి, విశ్వానికి శాంతి, స్వాతంత్ర్యం లభిస్తాయి" అని 1940లోనే ప్రభువు అచ్యుతులు వక్కాణించారు. "భారతదేశం పై ఇతరులు ఆక్రమిస్తారు. అపుడు మన వాళ్ళలో కొంతశక్తి వచ్చి ఉంటుంది అయినా దేశనాయకులు ఓసారి పైకి చూడాల్సి వస్తుంది. అప్పుడే యుద్ధభూమి మధ్యలో నేను ప్రత్యక్షమై శాస్త్రవేత్తల మారణాస్త్రాల్ని నా మీద ప్రయోగించు కుని, అవి నన్నేమీ చేయలేవు. యోగశక్తి అంటే ఏమిటి? అనే అంశాన్ని మొత్తం ప్రపంచానికి వెల్లడిస్తాను. The next moment I will be here అని 1950లో నేను ఆశ్రమంలో ఉన్నవేళలో వారన్నారు. ఇప్పటి ప్రపంచ పరిస్థితుల్ని అవలోకిస్తే ఆ సమయం సమీపంలోనే ఉందని అనిపిస్తుంది.

కొన్ని సంవత్సరాల దాకా నేను ఏకాంతవాసంలో ఉంటాను. అపుడు నేనెక్కడుండేది ఎవరికీ తెలియదు. గుండె చప్పుడు, నాడి కొట్టు కోవడం ఇవేవీ ఉండవు. వారి శిష్యులనిపించుకున్న వాళ్ళు చేయాల్సిందింతే! ఆ దేహాన్ని ఉన్నదున్నట్లు ఒక చెక్కపెట్టెలో పెట్టి భూ స్థాపితం చేయాలి. అతడు రావాల్సిన సమయానికి వెలుపలికి వచ్చి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తారు. అలా వచ్చేందుకు మీ పెట్టెలు, మీరు కట్టిన సమాధి కట్ట – ఇవేవీ అడ్డురావు. ఈ జోస్యం చెప్పి ప్రభువులు సూర్యోదయ సమయంలో 4-2-1958వ తేదీన సరిగ్గా సమాధిస్థులైనారు. వారి దేహం ఉన్న

సమాధి తుంగ భద్రానది ఒడ్డున ఉత్తర భాగంలో ఋష్యమూకంలో అచ్యుత కుటీరం సమీపంలో ఉంది.

ప్రభువుల పునరాగమనపు గుర్తులు కొన్ని కన్పిస్తాయి. అయితే గత 52 సంవత్సరాలుగా వేచి వేసారిన శిష్యులకు క్షణమొకయుగంగా గడుస్తోంది. ఇది ఉత్ప్రేక్ష కాదు ! అతిశయోక్తియూ కాదు.

## 10. పర్వకాలం

ఇప్పటి జగత్తులోని ఆపత్కాల నివారణ కోసం క్రాంతియే తారకమా? శాంతియా ? అనే ప్రశ్న మేధావుల్ని పీడిస్తోంది. యుద్ధం జరిగితే అణ్వస్త్రాల ప్రయోగంతో మొత్తం దేశానికే సర్వనాశనం కల్గుతుంది.

శాంతి అయితే పరస్పర భయాలు, సంశయాలు, మాత్సర్యాలు, ద్వేషాసూయలు ఇవి ఉండనే ఉంటాయి. తాత్కాలికంగా ఇవి ఉపశమించి, మళ్ళీ బలపడుతూ ఒక్కసారి విజృంభించగా, విపత్కాల స్థితి తప్పింది కాదు. దీని పరిహారం, ఉపాయం మానవ మస్తిష్కానికి గోచరించదు. దేవుడే గతి అనే ఆస్తికులూ ఉన్నారు. “ఎక్కడి దేవుడు? లేని కల్పన?” అని అందరినీ అవహేళన చేస్తూ తామే బుద్ధిమంతులమని విర్రవీగే నాస్తికుల సంఖ్య కూడ పెరిగింది. జగత్తునే ధరించిన ఆదిధర్మమే భువికి అవతరించి వస్తే, ఆ మహాశక్తి చేత ఆకర్షింపబడి సర్వలోకాలతో కూడిన విశ్వమే లేకుండా పోతుందని పలికే సిద్ధులూ ఉన్నారు. పూర్ణ చైతన్యపు ఏ అంశమూ కాని ఈ భూమి గ్రహం ఆ చైతన్యాన్ని ఎలా భరించగల్గుతుంది? అనే సంశయం వల్ల అతడి ‘కల్కి’ అవతారమే ఈ గండాన్ని పరిహరించే ‘తారక మంత్ర’మనే వాళ్ళూ ఉన్నారు.

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలున్నాయి. పూర్ణునిలో అతనితో అతన్నే అడిగిన వేళ అందరికీ తమ తమ అపూర్ణత్వ లోపం గోచరిస్తుంది.

శాంతే జగత్తుకు సుఖాన్ని, శ్రేయస్సును అందించే సాధనం. ప్రేమ ఒక్కటే జగత్తును పరిపాలించ గల్గుతుంది. భయానికి కారణమైన కుతంత్రాలు, బుద్ధి, దేహశక్తులు ఆ పని చేయలేవు. అయితే ఆ శాంతి రావాలంటే అహంకారుల అహంకారం తొలగడం చాలా అవసరం. అందుకు యుద్ధం అనివార్యం.

# 11. విశ్వ మానవ ధర్మం

యుద్ధానంతర జగత్తులో (మనం చూపినట్లు ఈ భూమి పై) ఒకే అధికారం స్థాపించబడుతుంది. ఒకే ధర్మం, ఒకే మతం స్థిరంగా ఉండి పోతుంది.

వర్ణాశ్రమధర్మాలు, కులవృత్తులు ఉండే ఉంటాయి. ఇవి సమాజ శ్రేయస్సుకు అవసరం. పుట్టిన మానవులకు జాత్యతీత సమాజమనేది ఒక భ్రాంతి.

దేశాతీతరాజ్యం కూడ అలాంటిదే ! దేహంలో వేరే వేరే భాగాలున్నట్లే ఈ వేర్వేరు దేశాలు. భాగాలకు వేర్వేరు కార్యాలున్నట్లే కొన్ని వృత్తులు ! మనస్సులో పుట్టే వేర్వేరు భావనల్లాగే సత్వ, రజస్తమో గుణాల ప్రవృత్తులు. ఇలా దోషాలకు అతీతమైన జ్ఞానం, శాంతి అనే స్థితులు సమాజపు నాల్గు వర్ణాలున్నట్లే ! బాల్యం, యవ్వనం, ప్రౌఢత్వం, వార్ధక్యం ఉన్నట్లే వ్యక్తి జీవనంలో నాల్గు దశలు (స్థితులు – ఆశ్రమాలు) వీటిలో ఏది త్యాజ్యం? ఏది పూజ్యం ? అన్నీ అవసరం. ప్రేమ, పరస్పర సహకారం ముఖ్యం. అందుకు మనమంతా ఒకే దేవుని బిడ్డలం అనే జ్ఞానం ముఖ్యం. ఈ తెలివి – భావన మానవ ప్రాణుల్లో లేదని కాదు. అయితే జీవన శైలి దీనికి తగినట్లుగా లేదు. దీనికి కారణం వీడి తండ్రి వీడి కన్న ఎంతో దూరంలో ఉండడం. అతను కన్పించక పోవడం వల్ల ఉన్నాడో లేడో అనే సంశయం కల్గింది.

అతడు ఒక శిశు రూపంలో భువిలో అవతరించి, మానవుడై నిలిస్తే అతని శక్తి, ప్రేమ ప్రకటితమై అతడే జగత్తుకు పిత అనే జ్ఞానం వెలువడ్డాక ఆస్తికత్వం, భక్తి, ప్రేమ ఉదయిస్తాయి. దృఢమౌతాయి. అపుడు మానవజాతి ఒక్కటే ! విశ్వధర్మం ఒక్కటే అనే జ్ఞానం కల్గుతుంది. గాంధీజీ కలలు కన్న రామరాజ్యమిదే ! మహర్షుల సత్యయుగారంభం, ఏసుక్రీస్తు దేవసామ్రాజ్యం, ఇప్పటి మేధావులు కోరుకునే విశ్వమానవ సౌభ్రాతృత్వం – వీటి వల్లనే విశ్వశాంతి కల్గుతుంది. మానవ జాతి సుఖ, శాంతులు, శ్రేయస్సు వీటన్నిటి వల్ల సాధ్య మౌతుంది.

## 12. సత్యయుగం ( శాంతి సామ్రాజ్య స్థాపన)

"క్రొత్త సూర్యచంద్రులు, క్రొత్త భూమి అంతా స్వర్గంలా ఉంటుంది. పుణ్యాత్ములు నిత్యపితతో కలిసి సుఖంగా జీవిస్తారు. పాపుల విచారణ జరిగి వాళ్ళు నిత్య నరకంలోకి పంపించబడతారు. రాత్రి అనేదే ఉండదు. రాజప్రాసాద ప్రాంగణంలో తోట జీవజలం చిమ్ముతుంది. ఆ జీవజలాన్ని త్రాగి నిత్యతృప్తులౌతారు. జీవవృక్షం ఉంటుంది. దాని ఫలాలను భక్షించి అమృతులౌతారు. తర్వాత పాపమనేదే ఉండదు. సైతాను వేయి సంవత్సరాల దాకా పాతాళంలో బంధించబడతాడు. అక్కణ్ణుంచి బయటికి వచ్చి విజృంభిస్తాడు. అపుడు అతణ్ణి అవమానించి పంపివేయడం జరుగుతుంది. జగత్తు అవతలకు వెళ్ళిన అతడు మళ్ళీ రాడు. అందరూ దేవపుత్రులౌతారు. అయితే మొదట వచ్చిన వాళ్ళు చిన్నవాళ్ళవుతారు. తర్వాత వచ్చిన వాళ్ళు పెద్దవాళ్ళౌతారు" మొదలైన బైబిల్ వాక్యాల్లో సెయింట్‌జాన్ సత్యయుగ వర్ణన చేశాడు. దీన్నే Revelation అంటారు.

తండ్రే రాజుగా విశ్వాన్ని పరిపాలిస్తాడని, అతని ద్వారా నియమింప బడిన పుత్రులు వేర్వేరు దేశాల రాజకుమారులుగా పరిపాలిస్తారని జాన్ రాసి వున్నాడు.

"నెలకు మూడు వానలు, రాజ్యమంతా సుభిక్షంగా ఉంటుంది. కుంతీభోజుడు రాజు ఔతాడు. సూర్యసావర్ణి పరిపాలకుడౌతాడు. ఈశ్వర సంవత్సరంలో పుత్రునికి పట్టం కట్టుతారు" – మొదలైన అంశాలు వీర బ్రహ్మం గారి గోవింద వచనాల్లో (కాలజ్ఞానం) ఉన్నాయి.

"శివశరణుల సామ్రాజ్యం స్థాపించబడుతుంది. ఇది శివశరణుల కాలజ్ఞానం". సత్యయుగ ప్రారంభమౌతుంది. భారతపు భవిష్యత్తులో శాంతి స్థాపన జరుగుతుంది. ఆర్థికనీతిలో 75 శాతం తీసుకుని, మన దాంట్లోంచి 25 శాతం చేర్చి ఒక క్రొత్త పద్ధతిని అవలంబించాల్సి వచ్చింది. విగ్రహారాధనం, మాంసాహారం ఇవి ఉంటాయో, ఉండవో చెప్పడం కష్టం". ఎందుకంటే వీటికి బాగా వయస్సు వచ్చింది. వీటన్నిటిని చేసేది నేనే అయినా "I will not be exactly on the throne" నేను సింహాసనం పై ఎక్కి ఉండను. నేనొక ఫకీరును. పరిపాలనా వ్యవస్థ గురించి ఒకసారి ప్రభువు "ఇలా చెప్పండి ! ఆనువంశికమైన పరిపాలనకు స్వస్తి చెప్పాం. మళ్ళీ దాన్నే అనుసరించడం ఎందుకు?" అని అడిగారు.

ఒక్కో గ్రామానికి ఒక పంచాయతి. తాలూకాకు ఒకటి. ఇలా జిల్లాకు, దేశానికి – ప్రతినిధులు ఉంటారు. వీరందరితో ఓ సభ జరుగుతుంది. ఆ సభకు ఒక అధ్యక్షుడు, ఆ అధ్యక్షుల పరిపాలన సాగుతుంది. వారు ఎన్నుకున్న అధికారుల వర్గం పనిచేస్తుంది. ఇంతే ! ప్రభువులు చెప్పిన అంశాల సంక్షిప్త వివరాలివి.

అయితే ఈ రోజుల్లో నాకు అనిపించేదేమంటే రాజ్యాన్ని పాలించే ప్రభువు ఎన్నుకోబడితే (ఎన్నికలు) మంచిదే ! ఎన్నుకోబడి వచ్చే అవకాశం చాలా తక్కువ. ఎన్నుకోబడి వచ్చిన వ్యక్తి స్వార్థపరుడు కాకున్నా తన గెలుపుకు కారణమైన స్నేహితుల స్వార్థ సాధనకు అవకాశం ఇచ్చి ప్రజల

అవిశ్వాసానికి పాత్రుడౌతాడు. వాళ్ళు తప్పుడు మార్గాన్ని అనుసరింప జేస్తారు. వారి లంచగొండితనం, పక్షపాతాలకు దారి తీస్తుంది. ఎన్నికల ఫలితంగా ప్రజల్లో ఐక్యభావం ఉండదు. వర్గాలు, మాత్సర్యం, అసూయ, ద్వేషాలు – ఇవన్నీ పెరుగుతాయి శాంతికి అవకాశం తక్కువ.

బహుసంఖ్యాకులదే బలం; అధికారం, న్యాయ నిర్ణయాలకు వెల ఉండదు ! ఫలితంగా మళ్ళీ అస్తవ్యస్తత ! విప్లవాలే ! విగ్రహారాధనే లేకుండా పోతుంది. దేవుని గురించి అనేక భ్రాంతులు, భిన్నాభిప్రాయాలు ఏర్పడతాయి. అంటే అజ్ఞానం పెరుగుతుంది. మాంసాహార పద్ధతి పోకుంటే – మనుష్యత్వం పూర్ణంగా వికసించదు. మృగత్వం పెచ్చు పెరుగుతుంది. "గుడిలోని విగ్రహాలను ఏం చేయాలి?" వాటిని మ్యూజియంలో పెట్ట వచ్చు. కళాకృతుల ప్రదర్శనకు, దేవాలయాల్ని విద్యాలయ సాంస్కృతిక కేంద్రాలుగా వాడుకోవచ్చు. విజ్ఞానాభివృద్ధి చాలా అవసరం. అయితే దాన్ని మానవలోక కళ్యాణానికి, ప్రగతికి ఉపయోగించాలి. మానవ వినాశనానికి కాదు. ఇలా జరగాలంటే విశ్వ సామ్రాజ్య స్థాపన మొక్కటే ఉపాయం !

అలా కాకుండ వ్యక్తి స్వాతంత్ర్యం, ప్రాదేశిక స్వాతంత్ర్యం, దేశ స్వాతంత్ర్యాలని అవకాశమిస్తే, మళ్ళీ మళ్ళీ "ఆడుదాం రా ! చెరిపేద్దాం రా!" అన్నట్లుంటుంది. ఇది బాల్యచేష్టయే కాని విజ్ఞత అనిపించుకోదు. ఈ లోకంలో దేశాల మధ్య సంబంధం, పరస్పర సహాయ సహకారాలున్నట్లే ప్రపంచపు విభిన్న లోకాల నడుమ కూడ అలాంటి బంధం అవసరం. అందుకే గీతలో "ప్రజాపతి ప్రజలతో పాటు యజ్ఞాన్ని సృష్టించాడు. మానవులు యజ్ఞాల ద్వారా దేవతల్ని భావించాలి. యజ్ఞంతో సంతుష్టులైన దేవతలు మానవులకు అవసరమైన వానల్ని, ధన, ధాన్య సమృద్ధుల్ని

సమయానికి అందించి, ఉపకరించాలి. ఇలా ఉభయులు యజ్ఞం ద్వారా పరస్పరం సహకారంతో సంతుష్టులై శాంతియుత జీవనం సాగించా"లని చెప్పబడింది.

జీవితమే ఓ యజ్ఞంలా క్రమబద్ధంగా సాగాలి ! స్వార్థం తక్కువై పరోపకార బుద్ధి పెరగాలి. "తన కోసమే ఆహారాన్ని వండుకొనే వాడు దొంగే" అని గీతలో చెప్పబడింది. తప్పుకు శిక్ష తప్పక విధించాలి. గాంధీజీ కలలు కన్న రామరాజ్యం ఎన్నటికీ సాధ్యం కాదు. ఎందుకంటే అది అజ్ఞానంతో కూడిన ఒక స్వప్నం". ముమ్ముందు ప్రభుత్వమే ఉండక ప్రజలు జీవించగల్గుతారని ఆయన చెప్పి ఉన్నారు. అది ఎన్నటికీ సాధ్యం కాదు. అలా కావాలంటే ప్రతి ఒక్కరూ పూర్ణ జ్ఞానులు కావాల్సి ఉంటుంది. జ్ఞానం వ్యక్తియొక్క శ్రమార్జిత ఫలమే తప్ప విచక్షణా రహితంగా దేవుడు అందరికి ఇచ్చే ప్రసాదం కాదు. దేవుడు సర్వప్రేమి. అయినా బుద్ధి లేని బాలుని చేతిలో ఆయుధం అందించి చూచే ఆలోచనా శూన్యుడు కాడు. త్రాగిన మైకంలో యంత్రాన్ని నడిపే ఆప్తమిత్రుడు కాదు".

ఆదిపురుషుని అజాగ్రత్త ఫలితంగా జగత్తుకు అవనతి ఆరంభమై ఈనాటి దుర్దశ సంప్రాప్తించింది. అతనిలా అతని తండ్రి ఉండజాలడు. అతడు పూర్ణుడు. అతనిచే స్థాపించబడేది సత్యయుగం. (శాంతి సామ్రాజ్యం) ప్రజాప్రతినిధుల సలహాలు స్వీకరించవచ్చు ! చివరి నిర్ణయం ప్రభువు గారిదే. బహు సంఖ్యాకుల నిర్ణయం కాదు. బుద్ధి జాగృతం కానిదే తలల్ని పరిగణిస్తే ప్రయోజనమేమిటి?

"బహు సంఖ్యాకుల్ని ఎదిరించే వాళ్ళెవరు?" ఇది మానవ మృగాల మదంతో కూడిన మాట. అహంకార పరాకాష్ఠ. దీనికి జవాబు బైబిల్‌లో ఉంది. దేవుడు అంటాడు "మట్టిలో పుట్టిన మిమ్మల్ని మట్టిలోనే చేరుస్తాను".

దేహం మట్టితో తయారవుతుంది. అంటే మట్టిలా భూతధాతువులతో ఏర్పడిందే ! అందులోని ఆత్మ ! ఆహా ! మానవబుద్ధి ఎంత విచిత్రం. ఎంత అహంకారం. భయం కల్గిన వెంటనే గుంటనక్కల్లాంటి మాటలు పలుకుతాడు.

ప్రశ్న : ఇచ్ఛలేకుండా ఆత్మకు మోక్షం సాధ్యమా? శ్రమ లేకుండా అలాంటి భాగ్యం కల్గుతుందా ?

జవాబు : మబ్బుగా ఉంటే మోక్షం అంటే ఏమిటి? భాగ్యం అంటే ఏమిటి? జగత్తు అంటే ఏమిటి?

అర్థం తెలియని ప్రశ్నలతో పోరాటం. మోక్షం అంటే విముక్తి. దేని నుండి ? అజ్ఞానం నుండి. భగమంటే ఈ జీవుల్ని భరించే విశాలమైన ఆకాశం (బయలు). అవకాశాన్ని అందించడం వల్ల దీనికి ఆకాశమని పేరు. ఉద్భవానికి, గతికి అవకాశమివ్వడం వల్ల ఇది భగం. ఇందులో జన్మించి, జీవించే జీవులు బీజాలున్నట్లే. 'బీజదాత నేనే' అని గీతలో చెప్పలేదా ?

దేవుడు ప్రపంచానికి అవతల ఉన్నపుడు అతనిలో కోరిక లేదు. విశ్వంలో జీవుల మధ్య ఉండే వేళ కోరిక ఉండడం సహజమే ! ఇచ్ఛతో మమ్మల్ని తనలో చేర్చుకున్న అతడు మనల్ని తన ప్రాణాగ్నితో శుద్ధీకరించి మళ్ళీ బయటికి వదలడం సాధ్యం కాదా? అది అసాధ్యమైతే అతడెలాంటి సర్వశక్తుడు? అతడు ఎలాంటి సర్వతంత్ర స్వతంత్రుడు ?

మీ అధిక ప్రసంగమే మీరు తండ్రి ప్రేమను పొందక, కష్టాలకు గురౌతారు. అలా చేయకండి. అలా చేస్తే అతనికి దుఃఖం కల్గేట్లు మీరు చేస్తారు.

**ప్రశ్న :** దేవునికి కూడ దుఃఖమా?

**జవాబు :** ఉండకుంటే అతనెలాంటి తండ్రి ? అతనిది ఎలాంటి ప్రేమ? అతనిదెలాంటి జ్ఞానం? "ఆత్మవత్ సర్వభూతాని" తనలాగే అందరిని చూడాలనే భావం అందరిలో ఉండాలి. అయితే ఆ రీతిలో జీవించే వాళ్ళు చాలా అరుదు. వాళ్ళే 'మహాత్ములు' అని గీతలో చెప్పలేదా? మహాత్ములే అలా ఉండే వేళ ఆ మహాత్ముల తండ్రి అయిన పరమాత్మ అలా ఉండడం సహజం కాదా ?

**ప్రశ్న :** పరమాత్ముడు నిర్లిప్తుడనీ, నిత్యానంది అని ప్రకృతితో సంబంధం లేని కేవల సాక్షి అని చెప్పారు కదా ?

**జవాబు :** చెప్పిన వాళ్ళు అల్పజ్ఞులు. తన కొడుకులు కష్టంతో, దుఃఖంతో పరితపించి ప్రార్థించగా అతడు నిర్లిప్తుడై ఆనందలోలుడై ఉండేంత స్వార్థపరుడా సర్వపిత ? అంత అజ్ఞానియా ? జీవుల్లా అతడు నిరంతరం లిప్తుడై కర్మదోషాల్ని కట్టుకొని అధోగతికి గురయ్యేవాడూ కాడు. కేవల నిర్లిప్తుడై, స్వార్థియై దుఃఖితుల గోడు వినిపించుకోని కఠినాత్ముడూ కాడు. అతడు లిప్తాలిప్తుడు ఎప్పుడు ? ఏ వ్యక్తి తన కష్టాన్ని, సందేహాన్ని నివారించ మని ధ్యానించి ప్రార్థిస్తాడో అలాంటి వ్యక్తియొక్క కష్ట సంశయాలను నివారిస్తాడు. అది అతని అనుగ్రహంతోనే సాధ్యం.

**ప్రశ్న:** అనుగ్రహం అంటే ఏమిటి?

**జవాబు :** గ్రహం నుండి వచ్చే తేజఃకిరణం వ్యక్తిలో చేరడం వల్ల కల్గే సత్పరిణామం.

**ప్రశ్న :** అలాగైతే దేవుడూ ఒక గ్రహమేనా ?

**జవాబు :** ఎందుకు కాదు? గ్రహం అంటే ఏమిటి? చలనం ఉండేది కదా ! దేవుడు స్పందనయే లేని స్థాణువా ? వ్యక్తి యొక్క విన్నపం అతనిలో ప్రతిబింబితమయ్యాక అతని మనసు కరిగి అతని

నుండి ఒక కిరణం వెలువడి భక్తునిలో చేరి ధైర్యాన్ని, శాంతిని కల్గిస్తుంది. కాల క్రమంలో అది సంశయ నివారణ, కష్ట నివారణలకు కారణమౌతుంది.

**ప్రశ్న :** కిరణమంటే ఒక నూతన ఆత్మ కదా ?

**జవాబు :** ఇది అతి బుద్ధిమంతుడి ప్రశ్న. కొన్నిసార్లు అలా జరుగుతుంది. ఉదాహరణకు ఒక అవతార పురుషునిలో ఒక్కో సందర్భంలో ఆ ఆత్మలో ఉండే ప్రజ్ఞాకార్యానికి సరిపోని వేళ మూలం నుండి ఆ రీతి కారణ రూపంగా ఒక క్రొత్త జీవమే జన్మించి, వచ్చి చేరుతుంది. శక్తి చాలక, ప్రాణశక్తి అలా వచ్చి చేరుతుంది. కృప పరిణామాన్ని కల్గించగా కారణరూపంలో వచ్చి చేరుతుంది. ఆ కిరణాల ద్వారా మానవులకు త్రికాలజ్ఞానం కల్గుతుంది. సూర్యమండలంలోంచి వచ్చే కిరణాల్లో కేవలం వెలుగును అందించే కిరణాలు వేరు. శక్తినందించే కిరణాలే వేరు. ఇదే విజ్ఞానం. విజ్ఞానానికి అంతం లేదు. ఎందుకంటే ఈ విశ్వం శాశ్వతం కాదు. ఇది Dynamic చలనశీలం. చలించే ఈ విశ్వం అనేక రకాల మార్పుల్ని పొందుతుంది. ఆ మార్పుల కారణాల్ని, జరిగే ప్రమాదాలకు పరిహారోపాయాల్ని తెలుసుకోవడమే విజ్ఞానం. దీన్ని గ్రహిస్తే చివరకు దేవత్వమంటే ఏమిటి అనేది సులభంగా అర్థమౌతుంది. అయితే విజ్ఞానాన్ని తెలుసుకోవడం కష్టం. ఎంత తపస్వి అయినా పూర్ణుడిని ఆశ్రయించి, ఆత్మ నివేదనం చేసుకున్నాకే అతనికి పూర్ణతృప్తి, శాంతి సాధ్యమౌతాయి. అందుకే "కర్మఠుడు, తపస్వి, జ్ఞాని – వీరందరి కన్న యోగి శ్రేష్ఠుడు" ని గీతలో చెప్పబడింది.

**ప్రశ్న :** గీతలో నా నాల్గు పాదాల్లో మూడు పైన ఉండి ఒక్క దాంట్లోంచే ఈ మొత్తం విశ్వం పుట్టిందనే మాటకు అర్థం ఏమిటి?

**ఉత్తరం :** జ్ఞానం అనేది సృష్టి గురించి దేవుడిలో జరిగే సహజ క్రియ. దీనికి నాల్గు అంగాలు. వాటి జ్ఞానాన్నే నాల్గు వేదాలన్నారు. అవే

ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, ఆధర్వణ వేదం. ఋక్ అంటే పైకి వెళ్ళే గతి. యజుష్ అంటే క్రిందకు వచ్చే గతి. సామం అంటే అప్రయత్నంగా నడిచే సహజగతాగతి. ఆధర్వం అంటే – లోపలి నుండి ప్రాణవాయువు బయటికి రావడం.

సాధకులైన వ్యక్తుల్లో ఈ ప్రాణవాయువు ఈ నాల్గు గతుల్లో అనుభవానికి వస్తుంది. అధర్వగతుల్లో చలించే అనుభవం ఔతుంది. అథర్వంతో బయటికి జాగరణ, లిప్తత, స్వహిత, పరహిత, లౌకిక కార్యాల సాధ్యత. ఋక్ ద్వారా వాయు సంచారానికి అడ్డుపడే కఫం తొలగింపు, యజుస్సు ద్వారా కత్తిరించబడిన కఫం జఠరాన్ని చేరి జీర్ణం కావడం, సామం ద్వారా శాంతికి అవకాశం కల్గడం. ఏకాగ్రత, ఉష్ణశమనం, ధ్యానావకాశం, జ్ఞాన వికాసాలకు సామమే ఆశ్రయం అందుకే "వేదానాం సామవేదోస్మి" అని చెప్పబడింది. వేద గ్రంథాల్లోనూ ఋక్‌లో తపస్సు (ప్రార్థన), యజుస్సులో యజ్ఞం, సామంలో భక్తి గీతాలు, ఆథర్వణంలో లౌకిక జీవనానికి అవసరమైన స్థూలవిజ్ఞానపు వివరాలు చెప్పబడ్డాయి. ముక్తి సాధన కోసం జ్ఞానం. అయితే భక్తికి ఇవన్నీ అవసరం. 'భక్తి' అన్నిటికన్న ముఖ్యం కావడమే సామవేదానికి అధిక ప్రాధాన్యమివ్వడానికి కారణం.

పరమాత్మ అనే చైతన్యంలోనూ క్రియా స్పందన వుంది. అదే యజ్ఞం. అక్కడ కోరిక లేదు. స్వార్థం లేదు. ఆ క్రియా ఫలితంగా 'ప్రాణ'మనే శక్తి సృష్టింపబడుతుంది. 'యజ్ఞం నుండి వృష్టి' అనే మాటలకు మూలం ఇదే! ప్రాణం నుండి విద్యుత్ ఉత్పత్తి, ప్రాణాన్ని చాలా మటుకు 'సమ్రాట్' (ఉన్నచోటే స్పందించే శక్తి) అనవచ్చు. అయినా దాని శక్తి పెరిగాక లేదా ఆత్మ యొక్క సహజాకర్షణ ఫలితంగా ప్రాణానికి ఊర్ధ్వగతి

కల్గుతుంది. అలాగే ఒత్తబడినపుడు లేదా క్రియాబాహుళ్యం వల్ల ప్రాణం సంకోచించిన వేళ అధోగతి ఉంటుంది.

పాపం ఎక్కువగా ఉండే జీవుల్లో ప్రాణం అధోమార్గాల ద్వారా దేహం నుండి బయటికి రావడానికి ఇదే కారణం. పరమాత్మ చైతన్యంలో చేరిన ప్రాణాంశం అతని ఆనందానికి కారణమై, జీవమై బయటికి వస్తుందని ఇదివరకే చెప్పబడింది. అందుకే "ఆనందాని భూతాని జాయంతే" అని మహర్షులు చెప్పారు. (ఆనందం నుండి జీవులు జన్మిస్తారు) సూర్యమండలం నుండి అసంఖ్యాక కిరణాలు బయటికి వచ్చినట్లే ఈ జీవులు బయటికి వచ్చి ఆదిలో జలతత్వం పై చేరడం "జలం పైన జీవభూతం తేలుతూ ఉంది" మొదలైన ద్రష్టల వాక్యాల్లో వర్ణింప బడింది. ఆ జీవభూతం త్రిమూర్తుల్లో ఒకడైన ప్రజాపతి ద్వారా వెలువడి దేహాన్ని ధరించాక ఒక్కో బ్రహ్మ సృష్టిలో వచ్చిన సామాన్య జీవి అవుతుంది. విశేష సందర్భాల్లో అధిదేవతల యజమాని అయిన కర్త యొక్క ఆవశ్యకతల ఫలితంగా పరమాత్మ నుండి ఉత్పత్తి అయి నేరుగా దేహధారణ చేసే జీవ చైతన్యానికి "ఆత్మ", "అవతారి" అని పేరు. పరమాత్మ చైతన్యం నుండి ఉత్పత్తి అయి, బయటికి వచ్చిన ప్రాణుని నుండి పుట్టిన వాయువు వ్యాప్తమై పరమాత్ముని చుట్టూ ఒక కాంతి యొక్క ఆవరణం ఏర్పడుతుంది. దీని ఆకారం ఒక వటపత్రంలా ఉంటుంది (మర్రి ఆకు) ఆవరణం మధ్యలో ఉండే ప్రాణశక్తి మరియు విద్యుదంశాల స్పందన గతాగతులతో కూడి ఉంటుంది. ఆ ఆవరణనే పరమాత్ముని దివ్యదేహం (జ్యోతికాయం) అంటారు. దాంట్లోంచి వెలువడిన కాంతి కిరణ వ్యాప్తివల్లనే జగత్తు సృష్టి జరుగుతుందని, ఎలా ఉత్పత్తి అయిందో అలాగే ఒకదానిలో ఒకటి మళ్ళీ చేరి ఆదిశక్తి అనిపించుకున్న ప్రాణంమళ్ళీ పరమాత్మలో చేరడమే మహాప్రళయమని అంటారు.

"అలాంటి మహాప్రళయం ఇది వరకు ఎన్నడూ జరిగి ఉండలేదు. ఇక ముందు కూడా జరగదు. శాశ్వతుడైన పరమాత్మ నుండి పుట్టిన ఈ జగత్తు ప్రవాహోపేతమై నిత్యమే అయి ఉంది" అనేది మా గురువులైన పూజ్య అచ్యుత ప్రభువుల నిర్ణయం. ఆ ప్రభావళి మధ్యలో కన్పించే జ్యోతిః శరీరాన్నే "అంగుష్ఠ మాత్ర పురుషుడు" అంటారు. (దాదాపు 21/2 అంగుళముల పొడవైన మానవాకృతి) అది శిశురూపాన్ని పోలి ఉంటుందని చూసిన వాళ్ళు చెప్పారు.

విద్యుత్ప్రభలాంటి ఆ దేహానికి నమస్కారం. అందులోంచే బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, అగ్ని, వాయువు, వరుణుడు, కుబేరుడు, ఇంద్రుడు మొదలైన వారంతా పుట్టారు. ఆ జ్యోతిశిలకు మధ్యలో పరమాత్మ ఉన్నాడు. "అలాగే మన శరీరంలో ఉత్తమాంగం అయిన శిరస్సులో బ్రహ్మరంధ్రంలో ఆత్మ చైతన్యంగా ఉంటూ, ప్రాణశక్తి సహాయంతో ఈ దేహ యంత్రం ద్వారా తన ఇచ్ఛ ప్రకారం, జ్ఞానానికి తగినట్లుగా జీవనాన్ని నడిపిస్తుంది" అని తెలిసిన వాళ్ళు చెప్పారు.

మూలచైతన్యపు ఆవరణమైన జ్యోతికాయంలో ఋక్, యజుస్, సామ గతులలో ఉండే పరిశుద్ధ వాయువు లోపలే ఉండి, క్రిందికి నెట్టబడిన అధోవాయువుతో విశ్వం సృష్టించబడింది. ఆ అథర్వం నుండే మొత్తం జగత్తు సృష్టించబడిందని చెప్పడం అందుకే ! జీవమాత్రులకు వాయుతత్వం, ప్రాణశక్తి మరియు ఆత్మ చైతన్యాల గురించి పూర్ణ జ్ఞానం కల్గడం చాలా కష్టం; అసాధ్యమనిపించేంత కష్టం.

"ఆదిలో నల్గురు పుత్రులు నా నుండి పుట్టారు" అని గీతలో చెప్పాడు భగవానుడు. ప్రాణుడు, వాయువు, అగ్ని, పృథ్వి భూతాల అభిమాని దేవతలనిపించిన ముఖ్య ప్రాణదేవుళ్ళు.

అజ్ఞాన నివారకుడైన గురువు – శంకరుడు. విరాట్ (వ్యాపించిన) వాయుతత్వాభిమాని అయిన 'నారాయణుడు' మరియు అన్ని లోకాలు క్రింద పడకుండా పట్టుకుంది దక్షిణంలోని ఆదివరాహుడే. దీన్నే బైబిల్‌లో సింహాసనాన్ని మోసిన నాల్గు ప్రాణులు ఉన్నారు. మృగముఖం (ముఖ్యప్రాణుడు), పక్షిముఖం (విరాట్ నారాయణుడు), ప్రాణిముఖం ఆదివరాహుడు (ఆదిపురుషుడైన కాముడు), మానవముఖం గురు, జ్ఞాని శంకరుడు.

వీరిలో 'బుద్ధిమంతు'డనిపించుకున్న నారాయణుని ఇచ్ఛతో ఈ జగత్తు నిర్మింపబడింది. బుద్ధిని వైశ్యులతో పోల్చారు. అందుకే మానవులు బుద్ధిప్రధానులనిపించుకున్నారు. నిజమైన పురుషత్వం (ధారణశక్తి – శక్తియుగపు ఓర్పు) "జ్ఞానం" అన్నిటి యొక్క వాస్తవిక జ్ఞానం. ప్రాణశక్తి ఎలాంటిదో ఎవరికీ తెలియదు. ఆ వ్యక్తులు పైనే ఉన్నారు. వాళ్ళు క్రిందికి దిగి క్రియ చేశాక ఆ ముగ్గురు వ్యక్తుల, శక్తుల, పాదాల గురించి మానవులకు తెలుసుకోవడం సాధ్యమౌతుంది. ఇదే ఆ గీతా వాక్యానికి అర్థం. (మూడు పాదాలు పైన, ఒకే పాదంలో జగత్తు) అంగుష్ట మాత్రపురుషుని (బొటన వ్రేలంత పురుషుణ్ణి) దర్శనం అయ్యాక ఆ రూపం శిశురూపం అనేది మనకు తెలుస్తుంది. Child is the father of the man" అనే ఆంగ్లంలో సామెత వుంది. God is an eternal child playing his eternal game in his eternal garden" అని అరవిందుల వారు, ఇతర జ్ఞానులు చెప్పారు. ఆ నిత్య శిశువు భువికి వచ్చి, మానవ శరీరంతో పెరిగి నిలిచినా దాని సహజత్వం శిశుత్వమే. ముగ్ధత్వం, పరిశుద్ధ ప్రేమ, జ్ఞాన విజ్ఞానాల్ని అతడు అందరిలాగే తపస్సు ద్వారా పొందాల్సిందే ! అందుకని అతడు కూడ ఒక గురువునాశ్రయించి, యోగ విద్యోపదేశం పొంది సాధన చేయాల్సిందే ! అతనిలో పాత

కర్మదోషా లుండవు. అందువల్ల ఈ జగత్తును ఎలా సర్దాలి? ఎలా సంస్కరించాలనేది వెంటనే పూర్ణంగా అతనికి బోధపడుతుంది. వేరే వాళ్ళకు ఆలస్యమౌతుంది. పూర్తిగా తెలియదు. చేసేందుకు శక్తి చాలదు. ఇంతే వ్యత్యాసం.

అయినా ఎవరూ నిరాశపడనవసరం లేదు. మనం దేవుని బిడ్డలం అనే భావం వున్న వాళ్ళకు శాంతి సామ్రాజ్య స్థాపన అనే సేవా కార్యంలో పాలుపంచుకునే అవకాశం బాగా లభిస్తుంది. సేవ చేసి, తృప్తులై, సుఖ సంతోషాలను, శాంతిని పొంది, జీవించి, వేరేవాళ్ళకు కూడ ఇవన్నీ లభించేట్లు చేయడమే దేవపుత్రుల భాగ్యం ! ధన్యత్వం !

# 13. కల్కి

## కల్కి అంటే ఎవరు?

ధర్మస్థాపన కోసం పరమాత్మ ఎన్నో అవతారాల్ని ధరిస్తాడనేది భారతీయుల నమ్మకం. అవతారం అంటే పరమాత్మ స్వయంగా శరీర ధారిగా పుడతాడని కొందరు, తాత్కాలికంగా ఓ దేహం ధరించి, తన లక్ష్యం నెరవేర్చుకున్నాక ఆ శరీరాన్ని విడిచి వెళ్ళిపోతాడని కొందరంటారు. పరమాత్మ చైతన్యం దేహం ధరించి పనిచేయడమే అవతారమనీ కొందరంటారు.

"నేను పుట్టుక లేనివాణ్ణి. ఆకార వికారాలు లేని వాణ్ణనీ భగవద్గీతలో చెప్పడం జరిగింది. 'అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం' (అధర్మం పెరిగినపుడు నన్ను నేనే సృష్టించుకుంటాను) అని చెప్పడం జరిగింది. అవతారం అంటే దేవుడు కాదు; ధర్మ వ్యవస్థ కోసం దేవుడి ద్వారా సృష్టించబడిన ఒక ఆత్మ. ఆ వ్యక్తి దేవుని ప్రతినిధిగా దుష్ట శిక్షణ, శిష్టరక్షణల్ని చేస్తాడని గ్రహించాలి. ఇదే విషయం 'పరిత్రాణాయ

సాధూనాం వినాశాయచ దుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే' అనే గీతావాక్యంలో ప్రతిధ్వనిస్తుంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కార్యాల్ని చేయక, కేవలం ధర్మ, జ్ఞానాల్ని బోధించే జ్ఞానుల్ని, అలాగే అద్భుత కార్యాలు చేసిన సిద్ధపురుషుల్ని అవతారపురుషులని అనరు. విభూతులు అంటారంతే.

దశావతారాలనేవి జ్ఞానులు చెబుతుంటారు. భాగవతంలో ఇరవై ఒక్క అవతారాలని చెబుతూ ఆ పదింటితో పాటు బ్రహ్మ, నారద, వ్యాస, ధృవ, ధృవవరద, కపిలుడు మొదలైన వాటినీ చేర్చారు. ఈ ఇరవై ఒక్క అవతారాలే కాదు, విరాట్‌పురుషుని వర్ణించి, అతడు దేవుని ప్రథమావ తారమని చెప్పబడింది. విరాట్ పురుషుడు, బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఇంద్రాది దేవతలు – చాలాకాలం దాకా దేవసామ్రాజ్యపు పరిపాలనాధి కారులుగా సృష్టించబడ్డారు. నారదుడు, సప్తర్షులు మొదలైన వాళ్ళు గురువులు. ధర్మం, జ్ఞానం – వీటిని బోధించేందుకే వీళ్ళు పుట్టారని గ్రహించాలి. ధృవుడు, ధృవవరదుడు – వీళ్ళిద్దరిని అవతార పురుషులనడం సరికాదు. మానవుడై పుట్టిన వ్యక్తి తపస్సుతో అసాధ్యమైన వాటిని కూడా సాధించవచ్చు అనే విషయం తెలిపేందుకు సృష్టించబడిన విభూతి ధృవుడని చెప్పవచ్చు.

పరమాత్మ తానే ఒక రూపాన్ని ధరించి దర్శనమిచ్చి అనుగ్రహించా డనడంలో తప్పేముంది? లేదా విరాట్ పురుషుడు దర్శనమందించి అనుగ్రహించాడన్నా సరిపోతుంది. ఎలాగైనా సరే ! ధృవుడు, ధృవ వరదుడు – ఇద్దరూ అవతార పురుషులు కాదనే అంశాన్ని గ్రహించాలి. కపిలుడు, దత్తాత్రేయుడు, వ్యాసుడు – మొదలైన వాళ్ళను విభూతులుగా భావించవచ్చు. అలాగే బుద్ధుడు కూడ. ఎందుకంటే వీళ్ళెవరూ దుష్ట శిక్షణ, శిష్టరక్షణ (అవతార) కార్యాల్ని చేయలేదు.

మత్స్య, కూర్మ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, కృష్ణ, కల్కి – వీళ్ళను అవతారపురుషులనవచ్చు.

కల్కి అంటే కలినాశకుడని అర్థం. కలి అంటే అజ్ఞానాంధకారపు చరమదశ. ఆ స్థితిలో మానవుల్లో మౌఢ్యం, మూర్ఖత్వం, స్వార్థం, ద్వేషాసూయలు నిండి జంతువుల్లా, క్రూరమృగాల్లా ప్రవర్తిస్తారన్నమాట ! కల్కి దేహం నుండి వెలువడే కిరణాల ద్వారా కలి నాశనమౌతుంది. ఖడ్గధారియైన కల్కి దుష్టులను శిక్షించి ధర్మరక్షణ చేస్తాడని భాగవతంలో చెప్పబడింది. అంటే కల్కి జ్ఞానబోధతో అజ్ఞానం తొలగుతుందని భావం. ధర్మ వ్యవస్థ కోసం, దుష్టుల్ని శిక్షించేందుకు ఖడ్గధారి అవుతాడని చెప్పబడింది. ఈ అవతార కార్యం విష్ణుయశ అనే పేరుగల బ్రాహ్మణ జాతిలో పుట్టిన వ్యక్తి చేస్తాడని చెప్పబడింది.

శ్రీకృష్ణుడు జ్ఞానియై ఉపదేశం చేశాడు. అవతార పురుషుడై దుష్టుల్ని శిక్షించి, శిష్టుల్ని రక్షించాడు. అక్కడ సాత్విక, రాజసత్వాల సమానత ఉంది. గుణాతీత స్థితి ఉంది. 'సమత్వం యోగ ఉచ్యతే' అనే వాక్యంలోని సత్యం ఆ వ్యక్తిలో గోచరిస్తుంది. అలాగే ఈ కలియుగంలో ఆ రీతిలో జ్ఞానియై ధర్మతత్వాన్ని బోధించి, యోగియై దుష్టశిక్షణ, శిష్టరక్షణల్ని చేసి, ధర్మ సంరక్షణ చేసే వ్యక్తియే కలి అని గుర్తించవచ్చు.

ప్రభు అచ్యుతులు తమ ఆశ్రమం ద్వారా "కల్కిసుధ" అనే పత్రికను ప్రకటించారు. అంటే కల్కి అవతరించే కాలం దగ్గరలో ఉందని భావం. అందుచేత మానవులంతా జాగృతులై, ధర్మనిష్ఠతో, జ్ఞానకాంక్షతో మెలగాలన్నదే మా ఆశయం.

ఓం శాంతిః !జయ అచ్యుత!

**జయతీర్థులు**

అచ్యుత యోగ విద్యాపీఠం, నాగసముద్రం.

# 14. ముగింపు (చివరిమాట)

ఈ ముగింపు ఈ గ్రంథానికి చివరి మాటే కాదు ! ఆధ్యాత్మిక క్షేత్రానికి నేనందించే చరమసందేశం కూడ !

నా జన్మ లక్ష్యం ధార్మిక క్షేత్రంలో సేవలందించడం. దానికి అవసరమైన ఆధ్యాత్మిక జ్ఞానార్జన కోసం మా గురుదేవులు పూజ్యయోగి శ్రీ అచ్యుతుల వారిని ఆశ్రయించాను. వారి ఋష్యమూకాశ్రమంలో యోగ విద్యోపదేశం పొంది, వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో, మార్గదర్శనంలో విద్యాసాధన చేసి, తర్వాత వారి అనుమతితో మళ్ళీ గృహస్థుడనై ఈ 37 వసంతాల సుదీర్ఘ సాధనలో సాగుతూ నా అనుభవ వికాసానుగుణంగా చిన్న చిన్న పుస్తకాలను ఆధ్యాత్మిక జిజ్ఞాసువుల కోసం రచించా.

ప్రభువుల ఆదేశానుసారం వారి అంతిమ రోజుల్లో (1958 నుండి ఇప్పటి దాకా) వారికి, ప్రజలకు మధ్య ఒక సంపర్కసూత్రంలా నేను పని చేస్తూ వచ్చాను. నా కర్తవ్య నిర్వహణలో సహజంగా నేను చేసిన తప్పుల్ని నా ప్రభువు క్షమిస్తారనే నమ్మకం నాకుంది. శక్తివంచన లేకుండా నా చేతనైనంత సేవ చేశానన్న తృప్తి కల్గిందని సవినయంగా గురుసన్నిధిలో నా మనవి అందిస్తున్నా.

మానవుడనైన నేనింకా స్వార్థపరుణ్ణే ! అందువల్ల దైవత్వంలో నిలచిన గురువుగారిని కరుణతో ధరణికి అవతరించి, నా ద్వారా జరగాల్సిన ధార్మిక క్షేత్రంలోని సేవా విషయంలో తగిన మార్గదర్శనం అందించి, కార్యపర్యవేక్షణ చేస్తూ ఆ సేవా కార్యాన్ని సఫలం గావించి,

నన్ను సకల మానవజాతిని సముద్ధరించాలని మంగళవాక్యాన్ని పాడి ఆత్మ నివేదన చేస్తున్నా.

**ఓం నమో అచ్యుతాయ కల్యాణకారకాయ**
**కారుణ్య కాయాయ నమో శ్రీ ఆదిదేవాయ**
**అచ్యుతాయ మంగళం**
**ఇతి దేవదేవోత్తమ, దేవతాసార్వభౌమ**
**అఖిలాండకోటి బ్రహ్మాండనాయక**
**ఆదిదేవ శ్రీ అచ్యుత ప్రభో !**
**బహుపరాక్ ! బహుపరాక్ ! బహుపరాక్ !**

'జయ అచ్యుత' **అచ్యుత శిశువు**
అచ్యుత యోగ విద్యాపీఠం **జయతీర్థులు**